సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM
# సాక్ష్యం
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ | ఆదివారం 17 మే 2026
సంపుటి: 17 | సంచిక: 139
పేజీలు: 08 | వెల: రూ.2:00
Published from Hyderabad, Vijayawada.

## త్రిభాషా సూత్రం తప్పనిసరి

సీబీఎస్ఈ లాంగ్వేజీ విధానంలో మార్పులు

త్రిభాషా సూత్రం తప్పనిసరి చేస్తూ ఆదేశాలు

ఎన్‌సీఈఆర్‌టీ సిలబస్‌కు లోబడి మార్పు

న్యూఢిల్లీ,మే16(సాక్ష్యం): దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ స్కూళ్లలో లాంగ్వేజ్ విధానంలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. రాబోయే 2026 జులై 1 నుంచి 9, 10 తరగతుల విద్యార్థులకు 'మూడు భాషల విధానాన్ని మిగతా 2 లో..





### ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

- 18నుండి క్రీడా పర్యాటక వారోత్సవాలు
- జిల్లా కలెక్టర్లతో సిఎస్ టెలీకాన్ఫరెన్స్

హైదరాబాద్,మే16(సాక్ష్యం): ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 తేదీ నుండి 23వ తేదీ వరకు మిగతా 2 లో..



### ఐసిస్ టెర్రరిస్ట్ అబూ బిలాల్ అల్ మినుకీ హతం

నైజీరియాతో కలసి అంతమొందించిన అమెరికా ఉగ్రవాదిని అంతమొందించినట్లు ప్రకటన

వాషింగ్టన్,మే16(సాక్ష్యం): ఉగ్రసంస్థ ఐసిస్‌కు చెందిన మరో మోస్ట్ వాంటెడ్ టెర్రరిస్టును మిగతా 2 లో..



### రాబర్ట్ వాద్రాకు ఢిల్లీ కోర్టులో ఊరట

ఈడి స్వతంత్రంగా పనిచేయడం లేదన్న వాద్రా

న్యూఢిల్లీ,మే16(సాక్ష్యం): షికోపూర్ భూ ఒప్పందానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో మిగతా 2 లో..

# అభివృద్ధి పథంలో భారతదేశం

- సెమి కండక్టర్ల విషయంలో భారత్ దూసుకెళ్తోంది
- మన సంస్కృతీసంప్రదాయాలు చిరస్మరణీయం
- భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి
- యూనికార్న్ సంస్థలు వందకు చేరాయని ప్రకటన
- నెదర్లాండ్స్ పర్యటనలో ప్రధాని మోదీ
- మోడీకి ప్రవాసభారతీయులు ఘన స్వాగతం



**నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులతో నిర్వహించిన సమావేశంలో భారత పురోగతి, ప్రపంచ సవాళ్లు, భారత్-నెదర్లాండ్స్ సంబంధాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రవాస భారతీయుల ఉత్సాహం చూస్తుంటే తాను భారత్‌లోని ఏదో పండుగలో పాల్గొన్నట్లుగా అనిపించిందని ప్రధాని వ్యాఖ్యానించారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో ఎప్పుడు మాట్లాడినా అక్కడి భారతీయుల కృషి, ప్రతిభ గురించి ఎంతో ప్రశంసిస్తారని చెప్పారు. నెదర్లాండ్స్ ఆర్థిక వ్యవస్థకు భారతీయులు అందిస్తున్న సేవలపై ప్రతి భారతీయుడు గర్విస్తున్నాడన్నారు.**

న్యూఢిల్లీ,మే16(సాక్ష్యం): సెమికండక్టర్ల విషయంలో భారత్ కీలక ముందడుగు వేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమికండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రధానికి ఘనస్వాగతం లభించింది. ప్రవాస భారతీయులతో కరచాలనం, మాటామంతీ నిర్వహించారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో ఎప్పుడు మాట్లాడినా ప్రవాస భారతీయులను ఎంతో ప్రశంసించేవారని ప్రధాని గుర్తు చేసుకున్నారు. హేగ్ నగరం భారతీయ స్నేహానికి సజీవ చిహ్నంగా మిగతా 2 లో..

# ధరల పెంపు దారుణం

పెట్రో ధరల పెంపు.. ప్రజల నెత్తిన పిడుగు

ఈ నిర్ణయంతో అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం

ఎక్స్‌లో పోస్ట్ చేసిన ముఖ్యమంత్రి రేవంత్





### పెట్రో ధరల పెంపుతో సామాన్యులపై భారం

హైదరాబాద్‌లో సీపీఐ(ఎం) నిరసన ప్రదర్శన

హైదరాబాద్,మే16(సాక్ష్యం): పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో సామాన్యులపై నేరుగా ప్రభావం పడుతుందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల మిగతా 2 లో..

హైదరాబాద్,మే16(సాక్ష్యం): పెట్రో ధరల పెంపు వల్ల నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యుల పాలిట పిడుగుపాటు అవుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై స్పందించారు. నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం తాజాగా తీసుకున్న పెట్రోల్, డీజిల్ ధరల పెంపు నిర్ణయం ఏ మాత్రం సమర్థనీయం కాదని సోషల్ మీడియా ఎక్స్ వేదికగా అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం అనేక రంగాలపై వ్యతిరేక ప్రభావం చూపుతుందని తెలిపారు.మోదీ ప్రభుత్వ అసమర్థ పాలన, అనాలోచిత విధానాల కారణంగా దేశ ఆర్థిక మిగతా 5 లో..

## మరొకరు అరెస్టు

- నీట్ పేపర్ లీక్ కేసు
- బాటనీ టీచర్ మనీషా అరెస్ట్
- ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించండి
- మోదీని డిమాండ్ చేసిన రాహుల్



పుణె,మే16(సాక్ష్యం): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో మరో కీలక సూత్రధారి, పుణెకు చెందిన బోటనీ టీచర్ మనీషా మందారేను సీబీఐ అరెస్ట్ చేసింది. ఆమె నీట్ బయాలజీ ప్రశ్నాపత్రం లీక్ కావడంలో కీలక పాత్ర పోషించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. పుణెకు చెందిన మనీషా బోటనీ విభాగంలో సీనియర్ అధ్యాపకురాలు మనీషాను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నీట్ పక్రియలో సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్‌గా నియమించింది. ఏప్రిల్ నుంచి ఆమె కొందరు నీట్ అభ్యర్థులకు తన ఇంటి వద్దే శిక్షణా తరగతులను నిర్వహించారు. ఆ సమయంలోనే ఆమె వారికి నీట్ పరీక్షకు సంబంధించిన బోటనీ, జువాలజీ పేపర్లలోని ప్రశ్నలను లీక్ చేశారు. ఆ ప్రశ్నలను నోట్ బుక్‌లో రాసుకోవాలని, మిగతా 5 లో..





# జూన్ 25 నుంచి సర్ ప్రక్రియ

ఇంటింటికి వెళ్లి బిఎల్‌వోల పరిశీలన

సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,మే16(సాక్ష్యం): దేశ వ్యాప్తంగా సర్ ప్రక్రియ ప్రారంభమైందని.. తెలంగాణలో జూన్ 25 నుంచి ఈ పక్రియ మొదలవుతుందని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇంటింటికీ వెళ్లి బీఎల్‌వో లు ప్రత్యేక సర్వే చేస్తారని అన్నారు. ప్రతి ఓటరుకూ ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేస్తారని.. ప్రతి ఇంటినీ కనీసం మూడు సార్లు బీఎల్‌వో సందర్శిస్తారని చెప్పారు. కొత్త ఓటర్ల వివరాలను ఫారం–6లో ప్రత్యేకంగా నమోదు చేస్తారన్నారు. వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ ఎన్యుమరేషన్ అవకాశం ఉందని మిగతా 5 లో..

### నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు

హైదరాబాద్,మే16(సాక్ష్యం): ఈ నెల 26న నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవుల మీదుగా కేరళ తీరాన్ని తాకుతాయని, అక్కడి నుంచి నాలుగైదు రోజుల్లో తెలంగాణలో ప్రవేశిస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అయితే తెలంగాణలో మాత్రం ఎండల తీవ్ర తగ్గడం లేదు. ఆదిలాబాద్, మిగతా 5 లో..



### పోలీసులకు లొంగిపోయిన

# భగీరథ

- లాయర్ల సమక్షంలో అప్పగించానన్న బండి
- నార్సింగ్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు పోలీసుల వెల్లడి



హైదరాబాద్,మే16(సాక్ష్యం): పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సాయి భగీరథ్ ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడు భగీరథ్‌ను అడ్వకేట్ల సమక్షంలో పోలీసులకు అప్పగించారు. చట్టం మీద గౌరవంతోనే భగీరథ్‌ను పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమే.. చట్టానికి అందరూ లోబడి ఉండాల్సిందే అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ..'నా కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు ఆరోపణలు వచ్చాయి. చట్టాలపై ఉన్న గౌరవంతో అడ్వకేట్ల ద్వారా పోలీసుల విచారణకు అప్పగించాను. నేను ఇంతకు ముందే చెప్పా.. చట్టం ముందు నా బిడ్డ అయినా, సామాన్యుడైనా సమానమే. అందరం చట్టాలకి మిగతా 2 లో..

# సంపాదకీయం

## ఆర్థిక కార్యాచరణ అత్యవసరం !

నాలుగు రాష్ట్రాలఅసెంబ్లీ ఎన్నికలు ముగిశాక బిజెపిలో కనిపించినంత ఆనందం మిగతా పార్టీల్లో కనిపించలేదు. కేరళలో అధికారం దక్కించుకున్నా కూడా కాంగ్రెస్ లో అంతటి ఆనందం కనిపించలేదు. బెంగాల్ దక్కడంతో బిజెపిలో ఎక్కడలేని ఆనందం, ఉత్సాహం కనిపించింది. ఆ ఆనందాన్ని ప్రజలతో పంచుకునేందుకు బిజెపి సిద్దంగా లేదు. ఎందుకంటే పెట్రో,డీజిల్ ధరలు పెంచడం, ఆర్థిక వ్యవస్త రోజురోజుకూ కుదేలవ్వడంతో ప్రజల్లో ఒకింత నిరాసక్తి కనిపిస్తోంది. కొత్తగా రెండు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి వచ్చింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ ఆనందంలో ఉండగానే దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్ర కష్టనష్టాల నెదుర్కొంటున్న వాస్తవాన్ని గుర్తించారు. హైదరాబాద్ పర్యటనలో ఆయన చేసిన వ్యాఖ్యలు రానున్న ముప్పును ముందే గమనించి చేసిన హెచ్చరికగా గుర్తించాలి. ఈ క్రమంలో ఒక్క బంగారం దిగుమతులే కాకుండా దేశీయ వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తున్న ఆహార దిగుమతులను కూడా నిలిపి వేయడం మంచిదని ప్రధాని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ఆర్థిక వ్యవస్థ రానున్న రోజుల్లో మరింత బలహీనం కానుందన్న కఠోర సత్యాన్ని మోడీ ఒప్పుకున్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చేసిన తప్పులకు ప్రజలు త్యాగాలు చేయాలని ప్రధానమంత్రి పిలుసపునిస్తున్నట్లుగా ఉంది. అందువల్ల రాజకీయ నాయకులకు సంబంధించి విప్లవాత్మక మార్పులు తీసుకుని వస్తే తప్ప సంక్షోభాన్ని గట్టెక్కలేమని ప్రధాని మోడీ గుర్తించడం లేదు. ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయెల్ సంయుక్త దాడులతో మొదలు పెట్టిన యుద్ధం ప్రారంభమై ఈ నెలాఖరుకు మూడు నెలలు పూర్తవుతాయి. ఫిబ్రవరి 28న మొదలైన ఈ యుద్ధం ఇప్పట్లో ముగుస్తుందనడానికి లేదు. ట్రంప్ రోజుకో మాట మాట్లాడుతున్నారు. ఆయన తీరు చూస్తుంటే యుద్ధం ఆగిపోయే సూచనలు కానరావడం లేదు. పశ్చిమాసియాలోని దేశాలన్నీ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ యుద్ధంలో పాల్గొంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో చమురు సరఫరా నిలిచి పోయింది. హోర్ముజ్ జలసంధి వద్ద అమెరికా ,ఇరాన్‌లు పట్టుబిగించాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 107 డాలర్లుగా ఉన్నది; రూపాయి మారకం విలువ డాలర్‌కు రూ.96కు చేరువలో ఉన్నది. రూపాయి విలువ ఎన్నడూ ఇంతగా పతనం కాలేదు. నిత్యం దాని ధర పతనం అవుతూనే ఉంది. దీనికి కారణం ఇబబడిముబ్బడిగా దిగుమతులే కారణమని చెప్పనక్కరలేదు. విదేశీ మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. అధికారికంగా వినియోగ ధరల సూచీ ద్రవ్యోల్బణం 3.5శాతం కాగా ఆహార ద్రవ్యోల్బణం 4.33శాతంగా ఉంది. గృహావసరాల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.913 కాగా కమర్షియల్ సిలిండర్ ధర రూ.3077 నుంచి రూ.3237 దాకా ఉంటోంది; డబ్ల్యూపీఐ ద్రవ్యోల్బణం 8.3శాతంగా ఉంది. ఇవన్నీ కూడా మన ఆర్థిక దౌర్బల్యాన్ని సూచిస్తున్నాయి. నేరుగా ఇవన్నీ ప్రజలపై తీవ్ర ప్రభావం చూపుతున్నవని గుర్తించాలి. దీనిని తట్టుకుని నిలబడేందుకు ధరలు పెంచడం మార్గం కాదు. ప్రజల్లో కొనుగోలు శక్తి పెరగడానికి చర్యలు తీసుకోవడం లేదు. దేశీయంగా ఆహార వస్తువులను ప్రజలకు నేరుగా, చౌకగా అందించే ప్రణాళికలు చేయడం లేదు. తెలుగు రాష్ట్రాలను తీసుకుంటే ఇక్కడ వరి, మిర్చి, శనగ,మక్కజొన్న తదితర పంటలు విపరీతంగా పండుతున్నాయి. ఇవి పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే కొనుగోలుదారులకు సరసమైన ధరలకు వస్తువులు దక్కడం లేదు. ఈ వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు గుర్తించడం లేదు. బంగారం దిగుమతులను నిలిపివేయడంతో పాటే ఇతర నిత్యావసరాల దిగుమతులను కూడా నిలిపివేయాలి. దేశీయంగా పండుతునున్న పంటలకు పోటీగా వస్తున్న ఆహారా ధాన్యాల దగుమతులపై ఆంక్షలు విధించాలి. అలాగే మనవద్ద గోదాముల్లో మూలుగుతున్న ఆహార ధాన్యాలను ఉచితంగా కాకుండా ప్రజలకు సరసమైన ధరలకు అందించాలి. అలాగే అన్ని విషయాలలోను పొదుపు పాటించి తీరాలి. ఇంధన వినియోగం, వంటనూనెలు, ఎరువులు మొదలైన వాటి వినియోగంలో పొదుపు అవసరమే. అందుకోసం అనవసర దిగుమతులను పూర్తిగా నిరోధించాలి. అననింటికి మించి ప్రజాప్రతినిధుల దుబారాలపై ఆంక్షలు విధించాలి. జీతభత్యాలు, ఉచిత పథకాలపైనా కొంతకాలం ఆంక్షలు విధించాలి. ఈ విషయంలో పాలకులు ముఖ్యంగా ప్రధాని మోడీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. అడ్డూ అదుపూ లేకుండా ఇంధన వినియోగానికి కారణమవుతున్న కాన్వాయ్‌లను రద్దు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు విదేశీ మారకద్రవ్యం నిల్వలను మళ్లీ సమృద్ధం చేయడానికి కఠిన చర్యలు అవలంబించాల్సిందే. ఇవన్నీకూడా ఎమర్జెన్సీ కింద అమలు కావాలి. రూపాయి మారకం రేటును స్థిరీకరించకుంటే మన విదేశీమారక నిల్వలు హరించకు పోతాయి. అందుకోసం రూపాయి మారకం రేటు స్థిరపరచేందుకు అసవరమైన చర్యలను తక్షణం అమలు చేయాలి. దేశ ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సమిష్టి నిర్ణయాలు అవసరం. ఆర్థిక నిపుణులతో చర్చించాలి. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి సూచనలు సలహాలు తీసుకోవాలి. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి కఠిన చర్యలకు ఉపక్రమించాలి. తక్షణ ప్రాతిపదికన చేపట్టవలసిన చర్యలపై సలహాలు ఇచ్చేందుకు తలపండిన ఆర్థికవేత్త నేతృత్వంలో ఒక నిపుణుల బృందాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా గ్రామాల నుంచి పట్టణాల వరకు నిరంతరంగా అభిప్రాయాలను సేకరించి, క్రోడీకరించాలి. మన దేశ వనరులు, వినియోగం, దిగుమతులను విశ్లేషించాలి. ఎక్కడ ఖర్చులు తగ్గించవచ్చో అన్నది ప్రజలతో పాటు, మేధావుల నుంచి సూచనలు స్వీకరించాలి. అప్పుడే మనకు ఒక పరిష్కారం దొరుకుతుంది. అంతే తప్ప కాన్వాయ్‌లలో ఒకటి రెండు కార్లను తగ్గించడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ చక్కబడదని ప్రధాని మోడీ త్వరగా గుర్తిస్తే మంచిది.

## పోలీసులకు లొంగిపోయిన
# భగీరథ

మొదటిపేజీ తరువాయి..

లోబడి ఉండాల్సిందే. మా అబ్బాయి ఏ తప్పూ చేయలేదని పదేపదే చెబుతున్నాడు. వాస్తవానికి ఫిర్యాదు రాగానే స్టేషన్‌లో అప్పగిద్దామని అనుకున్నా. లాయర్లను సంప్రదించి మా వద్ద ఉన్న ఆధారాలను నా కుమారుడు వారి ముందుంచాడు. వాటిని చూసి కేసు కొట్టేస్తారని.. బెయిల్ తప్పకుండా వస్తుందని లాయర్లు చెప్పారు. అందుకే కొంత జాప్యం జరిగింది. ఈరోజు కూడా బెయిల్ వస్తుందనే లాయర్లు చెబుతున్నారు. అయితే ఇంకా జాప్యం చేయడం సరికాదని అనుకున్నా. ఆ ఉద్దేశంతో మా అబ్బాయిని తీసుకొచ్చి లాయర్ల ద్వారా విచారణ కోసం అప్పగించాను. న్యాయ వ్యవస్థపై సంపూర్ణమైన నమ్మకం ఉంది. సోమవారం నాడు కోర్టు ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నప్పటికీ.. న్యాయ వ్యవస్థపై ఉన్న గౌరవంతో ఇంకా ఆలస్యం కావొద్దని విచారణకు అప్పగించా' అని తెలిపారు. అయితే పోలీసుల కథనం మరోలా ఉంది.

## ఐసిస్ టెర్రరిస్ట్ అబూ బిలాల్ అల్ మినుకీ హతం

మొదటిపేజీ తరువాయి..

మట్టుపెట్టామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటించారు. నైజీరియా దళాలతో కలిసి అమెరికా దళాలు ఐసిస్ టెర్రరిస్టు అబూ బిలాల్ అల్ మినుకీని అంతం చేశాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ కార్యకలాపాలను పర్యవేక్షించే అతడు సంస్థలో నెం.2 నాయకుడిగా ఉండేవాడని ట్రంప్ చెప్పారు. ఆఫ్రికాలో దాక్కుంటే తనను ఎవరు ఏమీ



చేయలేరని అతడు భావించాడని అన్నారు. కానీ అతడి సమాచారం తమకు నిత్యం అందుతూనే ఉందన్న విషయాన్ని మాత్రం పసిగట్టలేకపోయాడని ఎద్దేవా చేశారు. ఆఫ్రికా ప్రజలకు అతడి పీడ విరగడయ్యిందని కూడా ట్రంప్ వ్యాఖ్యానించారు. అతడి ఉగ్రనీడ తొలగిపోయిందని చెప్పారు. అబూ బిలాల్ అంతంతో ఐసిస్ గ్లోబల్ కార్యకలాపాలకు కూడా పెద్ద దెబ్బతగిలిందని చెప్పారు. ఈ మిషన్‌లో అమెరికా దళాలకు సహకరించిన నైజీరియా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అమెరికా, నైజీరియా సంయుక్తంగా ఈ ఆపరేషన్ నిర్వహించాయి. అతడి మృతితో ప్రపంచవ్యాప్తంగా ఐసిస్ కార్యకలాపాలు మరింత బలహీనమవుతాయని ట్రూత్‌లో ట్రంప్ పోస్టు పెట్టారు. నా ఆదేశాల మేరకు అమెరికా బలగాలు, నైజీరియా భద్రతా బలగాలు ఐసిస్ అగ్ర కమాండర్ అబు-బిలాల్ అల్-మినూకిని మట్టుబెట్టాయి. ఐసిస్‌లో రెండో అత్యున్నత హోదాలో ఉన్న మినూకి ఆఫ్రికాలో దాక్కోగలనని భావించాడు. కానీ మా గూఢచార వర్గాలు అక్కడా ఉన్నాయనే విషయం తెలుసుకోలేక పోయాడు. ఇక అతడు ఆఫ్రికా ప్రజలను భయభ్రాంతులకు గురిచేయలేడు. అమెరికన్లు లక్ష్యంగా ఆపరేషన్లకు ప్లాన్ చేయడంలో సహకరించలేడు. అమెరికాతో కలిసి పనిచేసిన నైజీరియా ప్రభుత్వానికి థాంక్స్' అని ట్రంప్ రాసుకొచ్చారు. నైజీరియాలో జన్మించిన మినూకి ఇస్లామిక్ స్టేట్ వెస్ట్ ఆఫ్రికా ప్రావిన్స్ సీనియర్ కమాండర్. ఇస్లామిక్ స్టేట్ తరఫున టెర్రర్ సెల్స్‌కు సూచనలు ఇవ్వడం, అంతర్జాతీయ నిధులను దారి మళ్లించడం వంటి కార్యకలాపాల్లో పాల్గొనేవాడు. ఆ ఆరోపణలతో 2023లో అమెరికా అతడిని ఉగ్రవాదిగా గుర్తించింది.

# త్రిభాషా సూత్రం తప్పనిసరి

మొదటిపేజీ తరువాయి..

తప్పనిసరి చేస్తూ సీబీఎస్ఈ అధికారికంగా సర్క్యులర్ జారీ చేసింది. జాతీయ విద్యా విధానం, నేషనల్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ సూచనలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు బోర్డు వెల్లడించింది. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ ఎన్‌సీఈఆర్‌టీ విడుదల చేసిన నూతన సిలబస్‌ను సమీక్షించిన తర్వాతే ఈ మార్పులు చేసినట్లు బోర్డు స్పష్టం చేసింది. ఏప్రిల్‌లోనే విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటికీ.. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా జులై నుంచి ఒక పరివర్తన ప్రక్రియ ద్వారా దీనిని అమలు చేయనున్నారు. కొత్త నిబంధన ప్రకారం విద్యార్థులు అభ్యసించే మూడు భాషల్లో కనీసం రెండు భాషలు కచ్చితంగా స్థానిక భారతీయ భాషలై ఉండాలి. ఒకవేళ విద్యార్థులు ఫ్రెంచ్, జర్మన్ వంటి విదేశీ భాషలను చదవాలనుకుంటే.. మిగిలిన రెండు భాషలు భారతీయ భాషలైనప్పుడు మాత్రమే దానికి అనుమతి ఉంటుంది. లేదా విదేశీ భాషను 4వ అదనపు భాషగానూ ఎంచుకోవచ్చు. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు గానూ ఈ నూతన విధానంలోని మూడో భాషకు 10వ తరగతిలో బోర్డు పరీక్ష ఉండదు. స్కూల్ స్థాయిలోనే ఇంటర్నల్ అసెస్‌మెంట్ ద్వారా దీనికి మార్కులు లేదా గ్రేడులు ఇస్తారు. అయితే ఇందులో పాస్ కావడం మాత్రం తప్పనిసరి. మిడిల్ స్టేజ్(మిడిల్ స్కూల్), సెకండరీ స్టేజ్ చదువుల మధ్య లాంగ్వేజ్ స్కిల్స్, గ్రామర్, రీడింగ్ కాంప్రహెన్షన్ వంటి అంశాలలో 75 నుంచి 80 శాతం వరకు పోలికలు ఉంటాయని బోర్డు పేర్కొంది. అందువల్ల ప్రస్తుతానికి 9వ తరగతి విద్యార్థుల కోసం ఎన్‌సీఈఆర్‌టీ రూపొందించిన 6వ తరగతి స్థాయి పాఠ్య పుస్తకాలనే ఉపయోగించనున్నారు. ఈ పుస్తకాలతో పాటు స్థానిక, రాష్ట్ర స్థాయి సాహిత్యానికి సంబంధించిన కథలు, కవితలను కూడా సిలబస్‌కు అదనంగా చేర్చాలని స్కూళ్లను ఆదేశించింది. దీనికి సంబంధించిన పూర్తి గైడ్‌లైన్స్‌ను 2026 జూన్ 15 నాటికి సీబీఎస్ఈ విడుదల చేయనుంది. జులై 1లోపు



19 అధికారిక భారతీయ భాషలకు సంబంధించిన 6వ తరగతి ఖీ3 పాఠ్య పుస్తకాలను బోర్డు అందుబాటులోకి తీసుకురానుంది. తాజా నిర్ణయంతో భారతీయ భాషలను ప్రవేశపెట్టడం వల్ల స్కూళ్లలో అర్హులైన ఉపాధ్యాయుల కొరత ఏర్పడే అవకాశం ఉందని బోర్డు గుర్తించింది. దీని కోసం పాఠశాలలకు కొన్ని కీలకమైన మినహాయింపులు, ప్రత్యామ్నాయ మార్గాలను సూచించింది.

# అభివృద్ధి పథంలో భారతదేశం

మొదటిపేజీ తరువాయి..

మారిందన్నారు. కాలం మారినా.. భారతీయ సంస్కృతి మారలేదని కొనియాడారు. ఈ సందర్భంగా ఈయూ దేశాలనుద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది. నెలకు 20 బిలియన్ డాలర్ల విలువైన డిజిటల్ చెల్లింపులు జరుగుతున్నాయి.

భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవి. ఇప్పుడు 100కిపైగా ఉన్నాయి. భారత్‌లో సెమీ కండక్టర్ ప్లాంట్ల పనులు జరుగుతున్నాయి. మేడిన్ ఇండియా చిప్‌లు తయారవుతున్నాయి. ఏఐ సమ్మిట్, జీ20 సమావేశాలను విజయవంతంగా నిర్వహించగలిగాం. భారత్‌లో 90 కోట్ల మంది ఓటర్లుగా నమోదయ్యారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో 64 కోట్ల మంది ఓటు వేశారు. ఈయూ దేశాల జనాభా మొత్తం కలిపినా 64 కోట్ల మంది కూడా లేరని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. 'ఇంతటి ప్రేమ, ఉత్సాహాన్ని చూసి నెదర్లాండ్స్‌లో ఉన్నానన్న సంగతి ఒక్క క్షణం మర్చిపోయాను. భారతదేశంలోనే ఓ ఉత్సవానికి హాజరైనట్లు అనిపించింది. భారత స్నేహానికి ది హేగ్ సజీవ చిహ్నంగా మారిందని అనిపిస్తోంది. నేను నెదర్లాండ్స్ నాయకత్వంతో మాట్లాడిన ప్రతిసారీ వారు ప్రవాస భారతీయులను ప్రశంసిస్తూనే ఉంటారు. నెదర్లాండ్స్ సమాజానికి, ఆర్థిక వ్యవస్థకు మీరు చేసిన సేవకు ప్రతి భారతీయుడు గర్వపడుతున్నాడు. మీ పూర్వీకులు ఇక్కడికి వచ్చినప్పుడు ఎన్నో విషయాలను వదిలేశారు. కానీ కొన్ని విషయాలు ఎల్లప్పుడూ వారితోనే ఉండిపోయాయి. భారతదేశ మట్టి పరిమళం, పండుగల జ్ఞాపకాలు, భక్తి గీతాల రాగాలు, పూర్వీకులు అందించిన విలువలు వారితోనే ఉన్నాయి. కాలక్రమేణా ఎన్నో సంస్కృతులు కనుమరుగయ్యా యనే వాస్తవానికి మానవ చరిత్రే సాక్ష్యం. కానీ భారతదేశ విభిన్న సంస్కృతి ఇప్పటికీ మన ప్రజల హృదయాల్లో బలంగా ఉంది. తరాలు మారాయి, దేశాలు మారాయి, పరిసరాలు మారాయి, కానీ కుటుంబ విలువలు, మనం ఒక సమూహానికి చెందినవారమనే భావన ఎన్నడూ మారలేదు. సరిగ్గా 12 ఏళ్ల క్రితం ఇదే రోజున, 2014 మే 16న లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. దశాబ్దాల తర్వాత భారతదేశంలో సంపూర్ణ మెజారిటీతో స్థిరమైన ప్రభుత్వం ఏర్పడింది. అప్పటి నుంచి కోట్లాది మంది భారతీయుల నమ్మకం నన్ను ఆగనివ్వదు, అలసిపోనివ్వదు' అని చెప్పుకొచ్చారు.



## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక

మొదటిపేజీ తరువాయి..

నిర్వహించే యువజన, క్రీడా, పర్యాటక వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మే 18 నుండి 23 వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై స్పెషల్ సిఎస్ లు జయేష్ రంజన్, వాణి ప్రసాద్ లతో కలసి శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువతలో క్రీడా స్ఫూర్తి, దేహదారుఢ్యం, సామాజిక చైతన్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకై ఈ కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. అదేవిధంగా పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్యం కల్పించాలని, పర్యాటక ప్రాంతాలను ప్రజలు సందర్శించేలా తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రధానంగా స్పోర్ట్స్ కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో నిర్వహించాలన్నారు. ప్రతీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈనెల 18న నిర్వహించే 'ఫిట్-తెలంగాణా థీమ్ తో రాష్ట్ర , జిల్లా కేంద్రాలలో 5ఐ రన్, అదేవిధంగా అన్ని మండల కేంద్రాలలో వ్యాకథాన్, యోగ తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ వారోత్సవాలు దోహదపడతాయని, దీనిలో భాగంగా ఈ వారం రోజులు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అన్ని మ్యూజియంలలో ఉచిత ప్రవేశం కల్పించనున్నట్టు వెల్లడించారు. అదేవిధంగా జిల్లాల్లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోళ్లపై కూడా జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడ జాప్యం లేకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

## రాబర్ట్ వాద్రాకు ఢిల్లీ కోర్టులో ఊరట

మొదటిపేజీ తరువాయి..

ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రాకు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో ఊరట లభించింది. ఈ కేసు విచారణలో భాగంగా కోర్టు ఆయనకు ఒక ష్యూరిటీతో బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా రాబర్ట్ వాద్రా మీడియాతో మాట్లాడుతూ దేశ న్యాయ వ్యవస్థపై తనకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ తీరుపై వాద్రా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఈడీ స్వతంత్రంగా పనిచేయడం లేదు. ఆ సంస్థను కేంద్ర ప్రభుత్వమే వెనుక ఉండి నడిపిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకే అది ముందుకు సాగుతోంది. ఈడీ వైపు నుంచి జరుగుతున్నది ఎంతమాత్రం న్యాయం కాదు. కేసు దర్యాప్తునకు నేను ఎప్పుడూ సహకరిస్తూనే ఉంటా. నేను ఎక్కడికీ పారిపోలేదు, ఇక్కడే ఉన్నాను. నా వద్ద దాచడానికి ఏమీ లేదు. దర్యాప్తు సంస్థలు అడిగే అన్ని ప్రశ్నలకూ సమాధానమిచ్చేందుకు సిద్ధంగా ఉన్నా. ఎలాంటి పరిస్థితులనైనా, చట్టపరమైన సవాళ్లనైనా ఎదుర్కొనే పూర్తి సామర్థ్యం నాకు ఉంది'.. అని రాబర్ట్ వాద్రా అన్నారు.

## పెట్రో ధరల పెంపుతో సామాన్యులపై భారం

మొదటిపేజీ తరువాయి..

ఎంపుపై శనివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మోదీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు నశించాలి. పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధాన్ని ఆపేలా కృషిచేయాలని డిమాండ్ చేశారు. మోదీ చెబుతున్న పొదుపు మంత్రంతో దేశాభివృద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. గ్యాస్ ధరల పెంపుతో ఇప్పటికే అనేక పరిశ్రమలు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.దేశం నేడు తీవ్రమైన దుర్భర పరిస్థిలో ఉందని చెప్పారు. నేరం చేసేవాడు ఒకడైతే ప్రజలకు శిక్ష వేసే పరిస్థితి నేడు నెలకొందని ఆరోపించారు. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం ఆగితే ఈ ధరలు పెంచాల్సిన అవసరం ఉండదన్నారు. అయితే, ప్రధాన మంత్రి మోడీ యుద్ధ నివారణ చర్యలు తీసుకోకుండా, అమెరికాకు దాసోహం అయిపోయి ట్రంప్‌నకు సాష్టాంగ నమస్కారం చేస్తూ ప్రజలు ధరలను భరించాలని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యులు జ్యోతి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగయ్య, పాలడుగు భాస్కర్, మల్లు లక్ష్మి, బండారు రవికుమార్, సీనియర్ నేత డీజీ.నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఎలక్ట్రిక్ సైకిల్‌పై కలెక్టరేట్‌కు వెళ్లిన కలెక్టర్

**నా దేశం - నా బాధ్యతతో పొదుపు చర్యలకు శ్రీకారం**

**పర్యావరణహిత జీవనశైలిపై ప్రజల్లో అవగాహన**

**ముఖ్యమంత్రి పిలుపునతో కలెక్టర్ లక్ష్మీశ అడుగులు**

విజయవాడ,మే16: ప్రపంచ వ్యాప్త సంక్షోభం నేపథ్యంలో ప్రతిఒక్కరూ నా దేశం–నా బాధ్యత నినాదంతో పొదుపు చర్యలను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని.. ఇంధన ఆదాతో ఆర్థికంగా లాభంతో పాటు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావొచ్చని ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ శనివారం ఉదయం నగరంలోని క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్‌కు ఎలక్ట్రిక్ సైకిల్‌పై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర, ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఒక్కో అడుగు ముందుకేస్తున్నామని.. ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల నేపథ్యంలో ఖర్చులను నియంత్రిస్తూ, అందుబాటులో ఉన్న వనరులను పొదుపుగా వినియోగించుకోవాలన్న ముఖ్యమంత్రి పిలుపునకు అనుగుణంగా ఎన్‌టీఆర్ జిల్లా యంత్రాంగం కార్యాచరణ ప్రారంభించిందని తెలిపారు. ఇందులో భాగంగా డీజిల్, పెట్రోలు వాహనాలకు బదులు ఎలక్ట్రిక్ వాహనాలు వినియోగం దిశగా ప్రజలను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ రోజు ఎలక్ట్రిక్ సైకిల్‌పై కార్యాలయానికి వెళ్లినట్లు వివరించారు. స్థానిక యువత రూపొందించిన ఈ–సైకిళ్లు చాలా బాగున్నాయని, ఇలాంటి ఇన్నొవేషన్స్‌ను ప్రతిఒక్కరూ ప్రోత్సహించా ల్సిన అవసరముందన్నారు. ప్రతి శుక్రవారం నో వెహికల్ డేను పాటించేలా అధికారులను ప్రోత్సహిస్తు న్నామని, స్థానికంగా సందర్శనలు, తనిఖీలకు విద్యుత్ సైకిళ్లు, అదేవిధంగా దూర ప్రాంతాలకు విద్యుత్ వాహనాలను వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. దేశ భవిష్యత్తు దృష్ట్యా ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణతో పాటు ఆర్థిక పొదుపును సాధించే జీవనశైలిని అలవరచుకోవాల్సిన అవసరం ఉందని, ఈ విషయంలో ప్రభుత్వ యంత్రాంగం ముందుండి ప్రజలకు ఆదర్శంగా నిలుస్తుందని స్పష్టం చేశారు. తాను ఇప్పటికే రెండు చిట్టి పాంథర్ విద్యుత్ సైకిళ్లను కొనుగోలు చేశామని.. ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఈ సైకిల్‌పై ఏకధాటిగా 40 కి.మీ. ప్రయాణించవచ్చన్నారు. ఇలాంటి విద్యుత్ వాహనాల సమాచారాన్ని తెలుసుకోవాలనుకునేవారు కలెక్టరేట్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సంప్రదించవచ్చని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

## పారదర్శకంగా ఇళ్ల జాబితా, ఇళ్ల గణన

**పక్రియను పరిశీలించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ,మే16: జన గణన - 2027 పక్రియకు సంబంధించి దశల వారీగా పక్రియ అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో జరుగుతోందని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సెన్సస్ జేడీ జి.ప్రసన్నకుమార్ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ, జేడీ ప్రసన్నకుమార్ శనివారం కంచికచర్లలో జరుగుతున్న ఇళ్ల జాబితా, ఇళ్ల గణన పక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇంటింటికి వచ్చే సిబ్బందికి సరైన, పూర్తి వివరాలను తప్పనిసరిగా అందించాలని విజ్ఞప్తి చేశారు. అత్యంత కచ్చితత్వంతో దోష రహితంగా డేటాను నమోదు చేయాలని, మార్గదర్శకాల ప్రకారం జనగణన నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. జనగణన అనేది దేశ ప్రగతి, ప్రణాళికా రూపకల్పనకు అత్యంత కీలకమైన పక్రియ అని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి, విద్య, వైద్యం, ఉపాధి, గృహ నిర్మాణం వంటి రంగాల్లో భవిష్యత్ కార్యాచరణకు జనగణన గణాంకాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సెన్సస్ జేడీ జి. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ జనగణనలో ప్రతి సమాచారం విలువైనదని, ప్రజల సహకారంతోనే సమగ్ర గణాంకాలు సిద్ధమవుతాయని ఫీల్డ్ స్థాయిలో సిబ్బంది నిబద్ధతతో పనిచేసి నాణ్యమైన డేటా సేకరణకు కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో వీఎంసీ సెన్సస్ ఇంచార్జ్ వెంకటరమణ, రూరల్ ఇన్‌ఛార్జ్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## పచ్చని పరిశ్రమలకు చేయూతనిద్దాం..

**గ్రీన్ ఆంతప్రెన్యూర్‌షిప్ ను ప్రోత్సహిద్దాం**

**ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషిచేద్దాం**

**స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

విజయవాడ,మే16: పర్యావరణ పరిరక్షణతో పాటు ఉపాధి అవకాశాల సృష్టికి దోహదపడే గ్రీన్ ఆంతప్రెన్యూర్‌షిప్‌ను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని, ఈ దిశగా ఔత్సాహికులను చేయిపట్టి నడిపించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శనివారం కంచికచెర్ల మండలం, పరిటాల గ్రామ చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ) వద్ద పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని ప్రాంగణంలో మొక్కలు నాటారు. అంగన్వాడీ, వైద్య ఆరోగ్యం, ఎ÷–లాస్టిక్ ప్రత్యామ్నాయాలు, వర్మీ కంపోస్టు తదితర స్టాళ్లను సందర్శించారు. కార్యక్రమానికి హాజరైన వారితో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. తడిచెత్త,



పొడి చెత్తను వేరుచేసి ఇస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న మహిళలను సత్కరించారు. అదేవిధంగా గ్రీన్ అంబాసిడర్లకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌కు చేరిన ఎ÷–లాస్టిక్‌ను స్వచ్ఛ రథానికి అందజేయగా బదులుగా పుస్తకాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ఎ÷–లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్రమైన నష్టం కలుగుతోందని.. భూమి, నీరు, గాలి కాలుష్యానికి ఇది ప్రధాన కారణంగా మారుతోందని పేర్కొన్నారు. ఎ÷–లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహిత ఉత్పత్తులను వినియోగించడం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. సింగిల్ యూజ్ ఎ÷–లాస్టిక్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ వినియోగించవద్దని కోరారు. అదేవిధంగా స్వయం ఉపాధి దిశగా యువత గ్రీన్ పరిశ్రమలపై దృష్టి సారించాలని, పేపర్ బ్యాగులు, జ్యూట్ ఉత్పత్తులు, సహజ సిద్ధ పదార్థాలతో తయారయ్యే వస్తువులకు ప్రోత్సాహం పెరుగుతోందని తెలిపారు. రీసైక్లింగ్, కంపోస్టింగ్, అప్ సైక్లింగ్, రిపైర్ అండ్ రీయూజ్ వ్యాపారాలపై దృష్టిసారించేలా ప్రోత్సహించనున్నట్లు తెలిపారు. ఇలాంటి పరిశ్రమలు పర్యావరణాన్ని కాపాడటమే కాకుండా ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడతాయని అన్నారు. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి పనిచేసినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీవో పి.లావణ్యకుమారి, డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కోగంటి వెంకట సత్యనారాయణ బాబు, స్థానిక అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# పేదరికం లేని సమాజామే లక్ష్యం

### స్వచ్ఛత మన జీవితోల భాగం కావాలి.. ఎక్కువమంది పిల్లలే మనకు సంపద

### స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సిఎం చంద్రబాబు

శ్రీకాకుళం,మే16:
పేదరికం లేని సమాజం చూడాలనేదే తన కోరిక అని సీఎం చంద్రబాబు అన్నారు. సమాజం మారితే స్వచ్ఛాంధ్ర సాకారమవు తుందని చెప్పారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు.. స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తలసరి ఆదాయం పెంచాలనేది తన ప్రధాన లక్ష్యమన్నారు. సంపద సృష్టించి పేదవాళ్లకు పంచాలి. ఆర్థిక అసమానతలు తగ్గించాలి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చిందంటే అది అధికారుల వల్లే వస్తుంది. స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్రతో స్వచ్ఛత వైపు అడుగులు వేస్తున్నాం. స్వచ్ఛమైన ఆలోచనలు చేయాలి. అదే మనకు మంచి చేస్తుంది. అలవాట్లు మారాలి.. తద్వారా సమాజం మారుతుంది. గత 16 నెలలుగా స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర నిర్వహిస్తున్నాం. వ్యర్థాల నుంచి కరెంట్ ఉత్పత్తి చేస్తున్నాం. ఒకప్పుడు నా పాదయాత్రల సమయంలో చెత్తే ఎక్కువ కనిపించేది. చెత్త నుంచి సంపద సృష్టించడానికి పార్కులు ఏర్పాటు చేశాం. సింగిల్ యూజ్ ఎ÷–లాస్టిక్‌ను నిషేధించాలి. గత 23 నెలల్లో రాష్ట్రానికి రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న





ఒప్పందాలతో మన పిల్లలకు 24 లక్షల ఉద్యోగాలు వస్తాయి. విశాఖకు గూగుల్ తీసుకొచ్చాం. పరిశ్రమలతో ఉత్తరాంధ్రకే వలసలు రావాలని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పాం. పిల్లలే సంపద అని ఇవాళ చెబుతున్నా. మూడో బిడ్డ పుట్టిన వెంటనే రూ.30 వేలు ఇస్తాం. నాలుగో బిడ్డ పుడితే.. రూ.40 వేలు ఇస్తాం. పిల్లలు భారమనుకోకూడదు.. వాళ్లే సంపద అని గుర్తించాలి. తల్లికి వందనం కింద రూ.15 వేలు అందిస్తున్నాం. భగవంతుడు కరుణిస్తే.. ఈ మొత్తాన్ని పెంచుతాం అని అన్నారు. గత ఐదేళ్లు గొడ్డలి పార్టీ చేసిన అరాచకం చూశాం. ప్రజల ఆస్తులన్నీ మార్చేసి గందరగోళం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల భూముల జోలికి ఎవరూ రాకుండా చర్యలు చేపట్టాం. భూ తగాదాలు లేకుండా చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిది.

# ఇంధన పొదుపుపై ప్రత్యేక దృష్టి

- **20 లక్షల సూర్యఘర్ కనెక్షన్లు లక్ష్యం**
- **సౌరవిద్యుత్ ఏర్పాటులో ప్రోత్సాహం**
- **ప్రదాని, ముఖ్యమంత్రి సూచనల అమలుకు కృషి**
- **విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి**

అమరావతి,మే16:
ఇంధన పొదుపు చర్యలను పెద్దఎత్తున ప్రోత్సహిస్తున్నట్లు ఏపీ విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ప్రభుత్వ ఆఫీసులు, పాఠశాలల్లో సోలార్ విద్యుత్ ఏర్పాటు చేస్తామన్నారు. సోలార్ ద్వారా వంట చేసుకునే విధానాలు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. విద్యుత్ సంస్కరణలు అందిపుచ్చుకునే తొలి రాష్ట్రం మనదేనని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో ఇంధన పొదుపు అనేది కీలకం కానుందన్నారు. దేశంలో కోటి సూర్యఘర్ కనెక్షన్లు ఉండాలని ప్రధాని చెప్పారని తెలిపారు. ఒక్క ఏపీలోనే 20 లక్షల కనెక్షన్లు లక్ష్యంగా పని చేస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి వెల్లడించారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ఇంధన పొదుపు మీద ప్రత్యేకమైన దృష్టి సారించినట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఖర్చులు తగ్గించుకోవాలని, పగటిపూట మన ఇంటిపైనే సౌరశక్తి ద్వారా విద్యుత్‌ను తయారుచేసుకుని వినియోగించుకోవాలని సీఎం చెప్పారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 6 లక్షల కనెక్షన్లు, ఒక్కో ఇంటిపైన 2 కిలోవాట్లు ఉచితంగా పేదలకు ఇవ్వాలని చాలా పెద్ద ఎత్తున సూర్యఘర్ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఇంధన పొదుపు అనేది చాలా ముఖ్యమైన అంశంగా ముఖ్యమంత్రి ముందుకువెళ్తున్నారని మంత్రి అన్నారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ లాంటి శిలాజ ఇంధనాలను భారతదేశం నిత్యం బయటి దేశాల నుంచి దిగుమతి చేసుకోవలసిన పరిస్థితి ఉందని మంత్రి తెలిపారు. సౌరశక్తి, గాలి ద్వారా ఇలా ప్రత్యమ్నాయ పద్ధతుల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేయాలని సీఎం చెప్పారన్నారు. ప్రతి ఇంటిపై 2 కిలోవాట్లకు రూ.60 వేలు, 3 కిలోవాట్లకు రూ.78 వేలు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందన్నారు. అదనంగా ఇంకో రూ.20 వేలు కలిపి ఇవ్వాలని ముఖ్యమంత్రి తెలిపారన్నారు. ఎస్సీ, ఎస్టీలకు 2 కిలోవాట్లకు మొత్తం రూ.1.25 లక్షల సబ్సిడీని ప్రభుత్వమే ఇవ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో ఇంధన పొదుపు చాలా ముఖ్యమన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, ఆస్పత్రులపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసి దాని ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేసి.. ప్రజలపై భారం పడకుండా ఉండేలా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి తెలిపారు. గడిచిన రెండు సంవత్సరాల నుంచి విద్యుత్ బిల్లులు పెంచకుండా ఎటువంటి ఖర్చులు ఉన్నా ప్రభుత్వమే భరించిందని చెప్పుకొచ్చారు. గతంలో ఉన్న 5 వేల కోట్ల భారాన్ని ప్రజలపై పడకుండా ప్రభుత్వమే భరించేలా సీఎం చొరవ చూపారన్నారు. విద్యుత్ ఉత్పత్తి పెంచి, ప్రజలపై భారం పడకుండా



నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అందులో భాగంగానే తమ ప్రొటోకాల్ వాహనాలను తగ్గిస్తున్నామన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి సూచనలను అందరం ఆచరించాలని మంత్రి సూచించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం, ప్రజలు కలిసి పనిచేయాలన్నారు. గత ప్రభుత్వంలో ట్రూ అప్ ఛార్జీలు, విద్యుత్ సుంకమంటూ ప్రజలపై విపరీతంగా భారం వేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం మొదటగా 13 పైసలు తగ్గించిందని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో విద్యుత్ చార్జీలు తగ్గించాలని, ప్రజలపై భారం పడకుండా చేయాలని సీఎం లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. గతంలో సీఎం తీసుకువచ్చిన సంస్కరణల వల్ల 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వగలిగిన స్థాయికి వచ్చామన్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు సలహాలు, సూచనల మేరకు క్లీన్ ఎనర్జీ ఇచ్చే దిశగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

## జిల్లాలో శరవేగంగా జలధార-జలహారతి పనులు

విజయవాడ,మే16:
ప్రభుత్వ అత్యంత ప్రతిష్టాత్మక జలధార– జలహారతి పనులను జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ శనివారం పరిశీలించారు. కంచికచర్ల మండలం పరిటాల గ్రామంలో జరుగుతున్న నక్కల వాగు ఫీడర్ ఛానల్ పనుల పురోగతిని పరిశీలించారు.
కంచికచర్ల ప్రధాన చెరువులో నిల్వ అయ్యే నీరు నక్కల వాగు ద్వారా ఇబ్రహీంపట్నం మండలంలోని చిలుకూరు నక్కల వాగులో కలుస్తుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఈ నీరు డిస్ట్రిబ్యూటరీ, ఫీల్డ్ చానల్స్ ద్వారా సాగునీటి అవసరాలకు వినియోగించడం జరుగుతుందని తెలిపారు. రూ. 2,53,966 అంచనా వ్యయంతో చేపట్టిన ఈ పనుల ద్వారా భూగర్భ జలాల పెంపుదలతో పాటు సాగునీటి అవసరాలకు గణనీయంగా ఉపయోగం కలుగుతుందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా పనుల్లో పాల్గొంటున్న వేజ్ సీకర్స్‌తో కలెక్టర్ ముచ్చటించారు. రోజుకు ఎంతమంది పనికి వస్తున్నారు, ఉదయం ఎప్పుడు పనులు ప్రారంభిస్తున్నారు, వేతనాలు సకాలంలో అందుతున్నాయా అనే విషయాలపై ఆరా తీశారు. ప్రస్తుతం 80 మంది కార్మికులు పనుల్లో పాల్గొంటున్నారని, ఉదయం 5.30 గంటలకే పనులు ప్రారంభిస్తున్నామని, ఏప్రిల్ 15 వరకు వేతనాలు జమయ్యాయని, రోజుకు రూ.300 నుండి రూ.307 వరకు వేతనం అందుతోందని వారు కలెక్టర్‌కు తెలిపారు. పనుల ప్రదేశంలో ఉన్న ముళ్ల పొదలను కూడా తొలగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎన్‌ఎంఎంఎస్ హాజరు విధానం గురించి డ్వామా పీడీ ఎ.రాము కలెక్టర్‌కు వివరించారు. ఉదయం 5.30 గంటలకు, తిరిగి ఉదయం 9.30 గంటలకు రెండు విడతల్లో హాజరు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ కార్మికులకు మజ్జిగ పంపిణీ చేసి, పనుల నిర్వహణపై తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో డ్వామా పథక సంచాలకులు ఎ. రాము, నందిగామ ఆర్డీవో అనిల్ కుమార్, డీఎల్‌డీఓ లక్ష్మీకుమారి, ఎంపీడీవో డి. వెంకటేశ్వరావు, ఐ/సి ఎంఆర్వో మానస, ఇరిగేషన్ ఏఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లాలో ఘోర ప్రమాదం

**రోడ్డు దాటుతున్న కూలీలపై దూసుకెళ్లిన టిప్పర్**

**ప్రమాదంలో నలుగురు మహిళా కూలీల దుర్మరణం**

**ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన డిప్యూటీ సిఎం**

కాకినాడ,మే16: జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కోవూరు బ్రిడ్జి వద్ద శనివారం జరిగిన ఒక ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు ఉపాధి హామీ కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. రోడ్డు దాటుతున్న కూలీలను.. టిప్పర్ లారీ బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉపాధి హామీ పనుల నిమిత్తం కూలీలు రోడ్డు దాటుతున్నారు. అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన ఓ టిప్పర్ లారీ వారిపైకి దూసుకెళ్లింది. లారీ వేగాన్ని నియంత్రించలేకపోవడంతోనే ఈ ఘోర ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. చనిపోయిన కూలీలు.. సత్యవతి, కృష్ణమ్మ, చిట్టెమ్మ, అన్నవరంగా గుర్తించారు. వీరంతా స్థానిక చీడిగ ప్రాంతానికి చెందినవారని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (ఉఉఊ)కి తరలించారు. వీరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల





కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో మృతుల గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి పొంగూరు నారాయణ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పొట్టకూటి కోసం పనులకు వెళ్తున్న నలుగురు మహిళా కూలీలు ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందడం అత్యంత బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబ సభ్యులకు మంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద ఘటనపై సమాచారం అందిన వెంటనే మంత్రి నారాయణ స్థానిక అధికారులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి ఎలాంటి లోటు రాకుండా, తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా యంత్రాంగాన్ని, వైద్య అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వం వారికి అన్ని విధాలా అండగా ఉంటుందని మంత్రి నారాయణ భరోసా ఇచ్చారు. ఘోర రోడ్డు ప్రమాదంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో నలుగురు మహిళా ఉపాధి హామీ శ్రామికులు మృతి చెందడం బాధాకరమని అన్నారు. చీడిగ గ్రామానికి చెందిన ఆరుగురు మహిళా శ్రామికులు రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్టు అధికారులు చెప్పారని డిప్యూటీ సీఎం తెలిపారు. పని ప్రదేశంలో ఇలాంటి విషాదకర ఘటన జరగడం తీవ్రంగా కలచివేసిందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కాకినాడ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించినట్లు వెల్లడించారు. బాధితులు పూర్తిగా కోలుకునే వరకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని చెప్పారు. మృతి చెందిన శ్రామికుల కుటుంబాలకు కూటమి ప్రభుత్వం పెంచిన పరిహారం రూ.4 లక్షలను త్వరితగతిన అందజేస్తామని తెలిపారు. లాగే రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.2 లక్షల సహాయంతో పాటు పీఎం సురక్ష యోజన, పీఎం జీవన్ జ్యోతి యోజన కింద లభించే బీమా మొత్తాన్ని కూడా అందిస్తామని పేర్కొన్నారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా రహదారుల పక్కన జరుగుతున్న ఉపాధి పనుల వద్ద భద్రతా చర్యలు కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జాతీయ రహదారులు, బైపాస్ రోడ్లు, ట్రాఫిక్ అధికంగా ఉండే ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచించారు.

## ఏపీ ఐసెట్-2026 ఫలితాల విడుదల

అమరావతి,మే16: ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన ఏపీ ఐసెట్-2026 ఫలితాలను మంత్రి నారా లోకేష్ విడుదల చేశారు. ఈ సందర్భంగా పరీక్షలో మొత్తం 91.41 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన ఈ పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు హాజరయ్యారు. ఫలితాలను అధికారిక వెబ్‌సైట్ లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్ నంబర్ ద్వారా ఫలితాలను చెక్ చేసుకోవచ్చని సూచించారు.

## బుల్లెట్ బండి ఎక్కిన చంద్రబాబు

శ్రీకాకుళం,మే16: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేటలో పర్యటించారు. 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజావేదిక సమీపంలోని స్టాళ్లను సీఎం చంద్రబాబు పరిశీలించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో 'స్వర ఆర్ట్ గ్యాలరీ'లో గిరిజనులు ప్రత్యేకంగా రూపొందించిన ఓవర్‌కోట్‌ను ఆయన కొనుగోలు చేసి ధరించారు. అనంతరం శ్రీకాకుళం జిల్లాలో పోలీసులు ఏర్పాటు చేసిన 'హెల్మెట్ బ్యాంక్'ను సందర్శించారు. పోలీసులను అభినందించిన సీఎం హెల్మెట్ ధరించి బుల్లెట్ వాహనం ఎక్కారు. ఆయన వెంట కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, ఏపీ మంత్రి అచ్చెన్నాయుడు, అధికారులు ఉన్నారు.

## గన్నవరం ఎయిర్‌పోర్టు మూసివేత అంటూ దుష్ప్రచారం

తప్పుడు ప్రచారాలను నమ్మొద్దన్న ప్రభుత్వం

విజయవాడ,మే16: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం మూసివేస్తారంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఏపీ ప్రభుత్వం ఖండించింది. ఇది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేస్తూ ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్‌చెక్ విభాగం 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది. గన్నవరం ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల రద్దీని తట్టుకొనేందుకు రూ.611.80 కోట్ల అంచనా వ్యయంతో నూతన ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయని తెలిపింది. దీన్ని త్వరలోనే ప్రారంభించేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), రాష్ట్ర ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తున్నట్లు తెలిపింది. అమరావతి గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఒక దీర్ఘకాలిక వ్యూహాత్మక ప్రాజెక్ట్. రాజధాని అమరావతి పరిధిలోని గుంటూరు జిల్లా, తాడికొండ మండలం రావెల గ్రామ సమీపంలో సుమారు 4,618 ఎకరాల్లో కొత్త గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు సిద్ధమయ్యారు. అయితే, ఇది భవిష్యత్తులో అమరావతిని గ్లోబల్ ఏవియేషన్ హబ్‌గా, విమానాల మరమ్మతుల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించిన దీర్ఘకాలిక ప్రాజెక్టు. రెండు విమానాశ్రయాలూ కలిసే కొనసాగుతాయి. మెట్రో నగరాలు, అభివృద్ధి చెందుతున్న రాజధాని ప్రాంతాల్లో ఒకటి కంటే ఎక్కువ విమానాశ్రయాలు ఉండటం సాధారణం. అదే విధంగా అమరావతిలో కొత్త ఎయిర్‌పోర్ట్ వచ్చినా, విజయవాడ గన్నవరం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ యథావిధిగా తన సేవలను కొనసాగిస్తుంది. ఈ అంశంలో తప్పుడు ప్రచారం నమ్మవద్దని కోరుతున్నాం అని పేర్కొంది.

## మంత్రి సవిత పొదుపు మంత్రం

శ్రీ సత్యసాయి జిల్లా,మే16: ఇంధన పొదుపులో భాగంగా మంత్రి సవిత.. తన ఇంటి నుంచి నడుచుకుంటూ వెళ్లి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. పెనుకొండ పట్టణంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి.. స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ తమ వీధిని పరిశుభ్రంగా ఉంచాలని పిలుపునిచ్చారు. అనంతరం సవిత మాట్లాడుతూ.. పరిశుభ్రమైన పరిసరాలతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమని తెలిపారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం తగ్గించాలని ప్రజలకు మంత్రి సూచించారు. షాపుల్లో ప్లాస్టిక్ కవర్లు వాడొద్దని వ్యాపారులకు విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛమైన పెనుకొండ కోసం ప్రజల సహకారం అవసరమని మంత్రి తెలిపారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయొద్దని సూచించారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్రతో గ్రామాలు, పట్టణాలు మరింత అందంగా మారుతాయని మంత్రి సవిత పేర్కొన్నారు.

## ప్లాస్టిక్ వాడకాలకు దూరంగా ఉందాం

నంద్యాల,మే16: 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గాంధీ చౌక్‌లో శనివారం ప్లాస్టిక్ నిర్మూలిద్దాం పర్యావరణాన్ని కాపాడుదామనే నినాదంతో పురపాలక అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖమంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి పాల్గొని ఎ÷-లాస్టిక్ వ్యర్థాలు అందజేసిన ప్రజలకు నిత్యవసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలకు ఒక కేజీ సేమ్యా ప్యాకెట్, ఒక కేజీ ప్లాస్టిక్ కవర్లకు కేజీ చక్కెర, ఒక కేజీకి 12 గుడ్లు అందజేస్తామన్నారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయించకుండా వ్యాపారులు సహకరించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ శ్రీనివాసులు, మెప్మా పీడీ వెంకట దాస్, ఇంజినీర్లు నాగభూషణ్ రెడ్డి, రసూల్, పవన్ కుమార్, శానిటరీ అధికారులు లక్ష్మీనారాయణ శర్మ ,మురళీధర్, శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధం ఉద్యోగుల నుంచే మొదలవ్వాలి

గుంటూరు,మే16: ప్లాస్టిక్‌ను క్రమంగా తగ్గిస్తూ పూర్తిగా నిర్మూలిద్దామని.. ప్రభుత్వ ఉద్యోగుల నుంచే ఈ కార్యక్రమం మొదలు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి పిలుపునిచ్చారు. గుంటూరు కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలను నాటారు. ప్రభుత్వ కార్యాలయాలను పరిశీలించి పరిశుభ్రతగా ఉంచుకోవాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్ఓ కోమలిపద్మ, సీపీఓ శేషశ్రీ, డీసీఓ వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

# ధరల పెంపు దారుణం



మొదటిపేజీ తరువాయి..

వ్యవస్థ కుదేలైందని సీఎం విమర్శించారు. ఆత్మనిర్భర్ కేవలం ఓట్లు రాల్చే నినాదమే తప్ప.. ఫలితాలు తెచ్చిన పాలసీ కాదన్నది తేలిపోయిందని సీఎం అన్నారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిన్నాయని... యువత ఉపాధికి గ్యారెంటీ లేని పరిస్థితి దాపురించిందని వ్యాఖ్యానించారు.
రైతుల ఆదాయాలు రెట్టింపు చేస్తామన్న హామీ ఒట్టి మాటగా మిగిలిందన్నారు. గత పదేళ్లుగా రూపాయి విలువ పతనమవుతూ వస్తోందని... ఇప్పుడు ఆ పతనం పరాకాష్ఠకు చేరిందని అన్నారు. ఈ పరిస్థితుల్లో ఇరాన్ - ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి పెట్రోల్, డీజిల్ రేట్లను పెంచడం సామాన్యుల నడ్డి విరచడమే అంటూ విరుచుకుపడ్డారు. ప్రపంచంలో భారత్‌ను మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామని ఘనంగా ప్రకటించుకుంటున్న మోదీ ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఎలా సమర్థించుకుంటుందని రేవంత్ ప్రశ్నించారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంత ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం 'పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచం' అని పదే పదే ప్రకటించిందని గుర్తుచేశారు. ఫలితాలు వచ్చి పది రోజులు కూడా గడవకముందే రూ.3 కు పైగా ధరలు పెంచడం ప్రజల నమ్మకాన్ని వంచించడమే అని అన్నారు. కేవలం ఓట్ల కోసం, ఎన్నికల్లో విజయం కోసం మోదీ అబద్దాలు చెబుతారని ప్రజలు భావిస్తున్నారని... ఇది విశ్వాస ఘాతుకం అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరలను తక్షణం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ రేవంత్ రెడ్డి ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# జూన్ 25 నుంచి సర్ ప్రక్రియ



మొదటిపేజీ తరువాయి..

తెలిపారు. హెల్ప్‌లైన్ 1950తో పాటు కాల్ యువర్ బిలెస్‌వో సదుపాయం కల్పించినట్లు చెప్పారు. ఎన్యూమరేషన్ దశలో ఫారం తప్ప అదనపు పత్రాలు అవసరం లేదని సీఈవో తెలిపారు. ఫారం ఇచ్చిన వారందరి పేర్లు డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలో చేర్చుతారని, ఫారం ఇవ్వని ఓటర్ల జాబితా బూత్ వారీగా ప్రదర్శిస్తారని తెలిపారు. డ్రాఫ్ట్ రోల్స్ తర్వాత అభ్యంతరాలను స్వీకరిస్తామని చెప్పారు. పుట్టిన తేదీ ఆధారంగా పత్రాల సమర్పణకు నిబంధనలు వర్తిస్తాయన్నారు. 1987 జూలై 1కు ముందు పుట్టిన వారికి ఒకే పత్రం సరిపోతుందని.. 1987 - 2004 మధ్య పుట్టిన వారికి తల్లిదండ్రుల వివరాలు కూడా తప్పనిసరి అని చెప్పారు. 2004 తర్వాత జన్మించిన వారికి తల్లిదండ్రుల పత్రాలు తప్పనిసరన్నారు. 2002లో రాష్ట్రంలో సర్ చేశారని సీఈవో తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలన్నదే ఎస్ఐఆర్ ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో 3.45 కోట్ల ఓటర్లు, 35 వేల పోలింగ్ స్టేషన్లు ఉన్నాయన్నారు. పొలిటికల్ పార్టీలకు కూడా దీనిపై సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎన్యూమరేషన్ తర్వాత డ్రాఫ్ట్ విడుదల చేస్తామని.. అందులో చూసుకొని ఓటర్లు మార్పు, చేర్పులు చేసుకోవచ్చని సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే, జూలై 31న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా విడుదల ఉంటుందని అన్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుంది. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితా విడుదల విడుదల చేస్తారు.

## చిరు వ్యాపారుల బ్రతుకు ఛిద్రం చేస్తున్న గ్రేటర్ వరంగల్ అధికారులు

### బాసటగా నిలిచి దైర్యం చెప్పిన మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

వరంగల్, 16 మే (సాక్ష్యం): దేశాయిపేట సి కె ఎం కళాశాల ఎదురుగా జీవనం సాగిస్తున్న చిరు వ్యాపారస్తులను వెంటనే ఖాళీ



చేయాలని, ఎన్డిఆర్ఎఫ్, పోలీస్, మున్సిపాలిటీ తదితర శాఖలు ఏకమై ముకుమ్మడి దాడి చేస్తూ చిరు వ్యాపారాలు చేస్తున్న వారందరినీ వెంటనే తమ వ్యాపారాలు ఖాళీ చేయవలసిందిగా హుకుం జారీ చేశారు. డీసిల్టేషన్ అంటే బురద పేరుకుపోయింది అని వాటిని శుభ్రం చేసేందుకు డబ్బాలు అన్ని తీసివేయాలని బల్దియా అధికారులు చెబుతున్నారు.
జీవనోపాధి లేక ఏదో పని చేసుకుని జీవనం సాగిస్తున్న పేద వర్గాలను అధికారం పొంది ఈ రకంగా ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదని, డీసిల్టేషన్ అనేది జనవరి మాసంలో చేస్తారని అప్పుడు వరద నీరంతా చేరి డ్రైనేజీలు కదలకుండా దుర్గంధం తెలియలే పరిస్థితి ఉంటుందని కానీ వారి చిరు వ్యాపారస్తుల సముదాయం కింద ఉన్న డీసిల్టేషన్ లేకుండా వారికి అవకాశం ఇవ్వాలని అప్పుడు కూడా స్పందించకపోతే ఈ రకంగా నోటీసులు జారీచేసి వారిపై చర్యలు తీసుకోవాలి. కానీ కొంతమంది ఉన్నత వర్గాల కోసం చిరు వ్యాపారుల పొట్ట మీద కొట్టడం సమంజసం కాదని అన్నారు. బాధితుల పక్షాన తాను నిరంతరం పోరాడుతానని అవసరమైతే స్ట్రీట్ వండర్స్ కోసం శాశ్వత నిర్మాణాలు చేపట్టి వారికి ఇటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బాధితులకు నష్టం జరిగితే తాను ఎప్పుడు అండగా ఉంటానని పనిచేసుకొని బ్రతుకుతున్న వారిని ఇబ్బందులకు గురి చేయడం సమంజసం కాదని ఈ రకమైన చర్యలు చేపడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా మారాలని లేకపోతే ప్రజాగ్రహానికి గురికావాల్సి వస్తుందని అన్నారు. ఉద్యోగాలు లేక, వ్యాపారాలు చేసుకోక ప్రజలు ఎలా బ్రతకాలని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. తక్షణమే పేదవారి నోటికాడి ముద్దను తీసివేసే ఆలోచన



ప్రభుత్వం మానుకొని వారి జీవనానికి ఆటంకాలు కలిగించకుండా వారి అభివృద్ధికి సహకరించాలని లేకపోతే వారికి న్యాయం జరిగే వరకూ నిరంతరం పోరాటం చేస్తామని అన్నారు. ఈ సందర్భంగా బల్దియా,పోలీస్, అధికారులతో జిల్లా కలెక్టర్ తో మాట్లాడి సమస్య పరిష్కారం కోసం కృషి చేశారు. ఈ కార్యక్రమంలో చిరు వ్యాపారస్తుల సంఘం బాధితులు జన్ను సురేష్ ఆదాము గజ్జి సుమన్, జన్ను నూతన బాబు, రాజమౌళి, డాలి, స్థానిక బారాస నేతలు, ఇట్యాల రాజు పటేల్, నాగిన బోయిన రామ్మీ యాదవ్, మాజీ కూడా డైరెక్టర్ మోడీ ప్రవీణ్ గౌడ్, తదితరులు పాల్గొని బాధ్యత వ్యాపారస్తులకు అండగా నిలిచారు.

# ప్లాస్టిక్ వాడకంతో అనర్థాలు

### ప్రజలు ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలి

మచిలీపట్నం,మే16: ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కంకణం కట్టుకున్నారని



మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. శనివారం మచిలీపట్నం రైతు బజార్ ప్రాంగణంలో జరిగిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పక్కా ప్రణాళికతో నిర్వహించాలన్నారు. గ్రామ వార్డు, సచివాలయాల వారీగా ప్రతినెల మూడో శనివారం ఈ కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్ధాలను, ప్రజలకు జరిగే నష్టాలను వివరించాలని.. దీనిపై సమగ్ర అవగాహనతో ముందుకు వెళ్లాలని అధికారులకు మంత్రి కొల్లు రవీంద్ర సూచించారు. రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల ప్రైవేటీకరణ ప్రస్తుత పరిస్థితుల్లో తప్పనిసరి అని ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు అన్నారు. ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు సబ్సిడీ ఇస్తున్నప్పటికీ.. ఒక్కో బస్సు ధర సుమారు రూ.1.60 కోట్ల నుంచి రూ. 1.70 కోట్ల వరకు ఉందన్నారు. ?ఇంత పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి బస్సులను కొనుగోలు చేయడం ప్రస్తుతానికి ఆర్టీసీకి, ప్రభుత్వానికి సాధ్యం కాని పనిగా చెప్పుకొచ్చారు. దీనికి బదులుగా బస్సులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగిస్తే.. వారే పెట్టుబడులు పెట్టి బస్సులను నడుపుతారన్నారు. దీనివల్ల ఆర్టీసీపై అదనపు ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. ÷ూష్ట్రంలో సుమారు 10 వేల బస్సులు నడుస్తున్నాయని ఆర్టీసీ ఛైర్మన్ తెలిపారు. వాటన్నింటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావాలంటే దాదాపు రూ.15 వేల కోట్లు అవసరమని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆర్టీసీపై ఇప్పటికే ఆర్థిక భారం పెరిగిందన్నారు. ప్రయాణికులకు ఛార్జీలు పెంచే ఆలోచన ఏదీ లేదని స్పష్టం చేశారు. డీజిల్ బస్సులతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ ఖర్చు చాలా తక్కువన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడమే కాకుండా, నిర్వహణ వ్యయం తగ్గి.. ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుందని అన్నారు. రాబోయే రెండు నెలల్లో ఈ ఎలక్టికల్ బస్సులు అందుబాటులోకి వస్తాయని కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు.

## నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు

మొదటిపేజీ తరువాయి..

కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ అధికారి ధర్మరాజు తెలిపారు. మహబూబ్‌నగర్, గద్వాల, నారాయణపేట జిల్లాల్లో 41-44 డిగ్రీలు, మిగతా జిల్లాల్లో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు చెప్పారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముంది.

## మరొకరు అరెస్టు

మొదటిపేజీ తరువాయి..

టెక్స్ట్ బుక్‌లో మార్క్ చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఆమె లీక్ చేసిన ప్రశ్నలు మే 3వ తేదీన జరిగిన నీట్ పరీక్షలోని ప్రశ్నలతో సరిపోలినట్టు సీబీఐ అధికారులు వెల్లడించారు . ఇప్పటికే ఈ కేసులో పుణెకు చెందిన కెమిస్ట్రీ లెక్చరర్ పీవీ కులకర్ణిని కూడా సీబీఐ అరెస్ట్ చేసింది. కులకర్ణి గత కొన్నేళ్లుగా నీట్ ప్రశ్నాపత్రం రూపొందించే అధికారిక నిపుణుల కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. కాగా, నీట్ ప్రశ్నాప్రతం లీకేజీ వ్యవహారంలో ఇప్పటివరకు ఢిల్లీ, జైపూర్, నాసిక్, పుణె, గురుగ్రామ్, అహిల్యానగర్ నుంచి తొమ్మిది మందిని సీబీఐ అరెస్ట్ చేసింది. సంచలనం సృష్టించిన 'నీట్' ప్రశ్నాపత్రం లీక్‌కు సంబంధించి కేంద్రంపై లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ శనివారంనాడు విమర్శలు కొనసాగించారు. తక్షణం కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. ప్రశ్నాపత్రాల లీకేజీతో 22 లక్షల మంది నీట్ విద్యార్థులు నష్టపోయారని, అయినప్పటికీ ప్రధాని దీనిపై పెదవి విప్పడం లేదని విమర్శించారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను తక్షణం తొలగిస్తారా? స్వయంగా ప్రధానమంత్రే ఇందుకు బాధ్యత వహిస్తారా? అని ప్రశ్నించారు. 'మోదీ జీ... ధర్మేంద్ర ప్రధాన్‌ను ఇప్పుడే తొలగించండి' అని ఆ ట్వీట్‌లో రాహుల్ పేర్కొన్నారు. వైద్యకళాశాలల్లో అడ్మిషన్ల కోసం మే 3న నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ-కమ్-ఎంట్రన్స్ పరీక్షలో అవకతవకలు వెలుగుచూడటంతో దీనిని రద్దు చేశారు. దీంతో దేశంలోని నలుమూలల నుంచి విమర్శలు వెల్లువెత్తాయి. జూన్ 21 తిరిగి పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనిపై రాహుల్ విమర్శలు గుప్పిస్తూ, నీట్ పరీక్షల కోసం రెండేళ్ల పాటు 22 లక్షల మంది విద్యార్థులు రేయింబవళ్లూ కష్టపడ్డారని, వారి కఠోర శ్రమ బూడిదలో పోసిన పన్నీరయిందని అన్నారు. పరీక్షలకు రెండ్రోజుల ముందే నీట్ పేపర్ వాట్సాప్‌లో డిస్టిబ్యూట్ అయిన విషయం




యావద్దేశానికి తెలుసునని చెప్పారు. దీనితో తనకెలాంటి సంబంధం లేదని ధర్మేంద్ర ప్రధాన్ చెబుతున్నారని అన్నారు. ఆర్ఎస్ఎస్, బీజేపీ, యూనివర్శిటీ అధికారుల కుమ్మక్కు కావడం వల్లే విద్యావ్యవస్థకు తీవ్రనష్టం జరిగిందని ఆరోపించారు. ప్రతిభ ఆధారంగా కాకుండా సైద్ధాంతిక అనుబంధాల ఆధారంగానే వైస్ ఛాన్సలర్ల నియామకాలు జరుగుతున్నాయని అన్నారు. వైస్ ఛాన్సలర్ కావడానికి ఎలాంటి స్జబెక్ట్ నాలెడ్జ్ అవసరం లేదని, ఆర్ఎస్ఎస్‌కు చెందిన వారైతే చాలని, ఈ విషయం యావద్దేశానికి తెలుసునని అన్నారు. ఆర్ఎస్ఎస్ ఐడియాలజీ లేకుంటే ఎప్పటికీ వైస్ ఛాన్సలర్లు కాలేరని అన్నారు. దేశంలో 80 సార్లు పేపర్ లీక్‌లు జరిగాయని, రెండు కోట్ల మంది యువత భవిష్యత్తు నాశనమైందని లెక్కలు చెప్పారు. పేపర్ లీకేజీలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని మరోసారి డిమాండ్ చేశారు.

## డెంగ్యూ నివారణకు
# ప్రజలు అవగాహన కలిగి ఉండాలి

– ప్రతి సంవత్సరం జాతీయ డెంగ్యూ నివారణ డే మే 16



**కాప్రా,మే : 16** జాతీయ డెంగ్యూ డే ను పురస్కరించుకొని కాప్రా సర్కిల్ పరిధిలోని బిజె ఆర్,జెమ్మిగడ్డ కాలనీలలో చేపట్టిన అవగాహన కార్యక్రమంలో అసిస్టెంట్ ఎంటమాలజిస్ట్ డి.రమేష్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 16న భారతదేశంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని జాతీయ డెంగ్యూ దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు.రమేష్ మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ నివారణకు ... పాటిస్తారు. డెంగ్యూ జ్వరం పై ప్రజల్లో అవగాహన పెంపొందించడం,నివారణ చర్యలు తీసుకోవడం మరియు దోమల వ్యాప్తిని అరికట్టడం దీని ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు.ఈ సందర్భంగా బిజెఆర్, జమ్మిగడ్డ కాలనీలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీవాసులు, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్ డీజిల్ ధరలు తగ్గించాలి

– సామాన్య ప్రజల పైన మోయలేని భారం – కమ్యూనిస్టులు లీడర్ చిరంజీవి



**నారాయణఖేడ్ మే 15( సాక్ష్యం న్యూస్ )** కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని ఇది పేదల పైన మోయలేని భారం అన్నారు కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలకు నడ్డిని విచ్చే విధంగా పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు ఉన్నాయన్నారు ఇప్పటికే సామాన్యుడు కొనలేని పరిస్థితిలో అనేక వస్తువులు ఉన్నాయన్న ప్రభుత్వం పెంచిన పెట్రోల్ గ్యాస్ ధరలు వెంటనే తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు కొనడానికి సామాన్య ప్రజలు అందనంత దూరంలో ఉన్నారు ఇలా రేట్లు పెట్రోల్ డీజిల్ పెరగడంతో ప్రతి వస్తువు పైన కూడా భారంపదే విధంగా ఉ ందన్నారు కావున కేంద్ర ప్రభుత్వం వెంటనే పెట్రోల్ డీజిల్ ధరలను గ్యాస్ ధరలను తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు అంబేద్కర్ పూలే సంఘం డివిజన్ అధ్యక్షులు నర్సింలు మోహన్ బాలు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## సైడ్ డ్రైనేజ్ పనులను
# ప్రారంభించిన సర్పంచ్ దాసరి రమేష్



**ఖానాపురం మే 16 (సాక్ష్యం న్యూస్ ):** వర్షాకాలంను దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా రోడ్ల మీద నీరు నిలవకుండా సైడ్ డ్రైనేజీ నిర్మాణపు పనులను చేపట్టినట్లు ఖానాపురం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ దాసరి రమేష్ తెలిపారు. ఖానాపురం మండల కేంద్రంలోని హనుమాన్ వీధిలో నూతనంగా నిర్మిస్తున్న సైడ్ డ్రైనేజీ పనులకు సర్పంచ్ దాసరి రమేష్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ రమేష్ మాట్లాడుతూ రోడ్ల పైన నీరు నిలవకుండా గ్రామస్తులకు ఇబ్బంది కలగకుండా, అంటువ్యాధులు ప్రబలకుండా ఉ ండేందుకు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సైడ్ డ్రైనేజ్ చేపడుతున్నట్లు తెలిపారు. గ్రామపంచాయతీ పర్మిషన్ తోనే ర్యాంపులు కట్టాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. గ్రామస్తులందరూ కూడా గ్రామ అభివృద్ధి కోసం తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఉ ప సర్పంచ్ ఉప్పు రాజు వార్డు సభ్యులు పల్నాటి నిర్మల కందుల రమ, శాఖమూరి ముఖేష్, గుండ్లపల్లి విజయ్, వేములపల్లి వెంకట ప్రసాద్ రావు, చలిగంటి మల్లికార్జున్, ఈలపొంగు కొమురమ్మ, మహమ్మద్ అజహర్, గుండ్లపల్లి మంజుల నాయకులు మచ్చిక అశోక్, డెంకల వెంకటేశ్వర్లు, రాగం సతీష్, కామిశెట్టి సుధీర్, భూక్య నవీన్, తోటకూరి రాజు, మర్రి రామస్వామి, నూనెల కుమారస్వామి, నరహరి, పల్నాటి శ్రీను, కందుల సాంబయ్య, ఓర్సు రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్‌కు
# హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు చేయాలి: మొహీద్ పటేల్



**నారాయణఖేడ్ మే 15( సాక్ష్యం న్యూస్)** నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని ... హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేయాలని ఎంఐఎం నారాయణఖేడ్ అధ్యక్షులు, న్యాయవాది మొహీద్ పటేల్ శుక్రవారం సబ్ కలెక్టర్ ఐఏఎస్ ఎన్. ఉమా హారతి గారిని కోరారు. ప్రతి ఓటరుకు అవగాహన కల్పించి మ్యాపింగ్ పూర్తి చేసుకునేలా సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సబ్ కలెక్టర్ త్వరలో హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

# ఘనంగా టీయూడబ్ల్యూజే (ఐజేయు) మహాసభ

– నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా షఫీ అహ్మద్, వాసుదేవ్‌లు గెలుపు



**ఏటూరునాగారం, మే 16, (సాక్ష్యం) :** ములుగు జిల్లా టియుడబ్ల్యూజే ఐజేయు అనుబంధ జర్నలిస్టు సంఘం మహాసభ ఘనంగా జరిగింది. శనివారం జిల్లా కేంద్రంలోని డిఎల్ఆర్ గార్డెన్స్ లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షఫీ అహ్మద్, వాసుదేవ్ ల అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాంనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపల్లి మదు, రాష్ట్ర ఎగ్జ్ క్యూటీవ్ మెంబర్స్ కంకనాల సంతోష్, కొండం రవిందర్ రెడ్డీలు మహాసభ నిర్వహించారు అనంతరం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జిల్లా నూతన కమిటీ ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలోని పది మండలాల పరిదిలోని 262 మంది జర్నలిస్టులకు 2 వందల మంది హాజరయ్యారు. వీరి సమక్షంలో రాష్ట్ర కమిటీ నూతన బాడీ ఎన్నిక కొనసాగింది. ఇందులో బాగంగా కోషాధికారి, ఉపాద్యక్షులు, ఈసీ మెంబర్లు ఏక గ్రీవం కాగా అధ్యక్ష, కార్యదర్శులకు ఎన్నికలు జరిగాయి. జిల్లా అధ్యక్షులుగా ఎమ్డీ షఫీ అహ్మద్, బేతి సతీష్ లు భరిలో నిలబడగా. కార్యదర్శిగా చిదురాల వాసుదేవ్, గంపల శివ భరిలో నిలిచారు. రాష్ట్ర కమిటీ సారధ్యంలో జరిగిన ఈ ఎన్నికలలో పాల్గొన్న పది మండలాల జర్నలిస్టులు అధ్యక్షునిగా షఫీ అహ్మద్ సాక్షి టీవి రిపోర్టర్ ను 112 ఓట్లు వేసి గెలిపించుకున్నారు. కార్యదర్శిగా చిదురాల వాసుదేవ్ సాక్ష్యం రిపోర్టర్ ను 120 ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించుకుని రెండవ సారి వారికి బాధ్యతలు అప్పజెప్పి వారి సేవలను పది మండలాల జర్నలిస్టులు కోరుకున్నారు. కాగా బేతి సతీష్ 47 ఓట్లతో, గంపల శివ 48 ఓట్లతో పరాజయం పాలయ్యారు. దీంతో పది మండలాల జర్నలిస్టులు వారికి కావలసిన నాయకులను ఎన్నుకుని పుష్ప గుచ్చాలు అందజేసి, శాలువలతో సన్మానించి సత్కరించారు. మొత్తానికి జిల్లా ద్వితీయ మహాసభ ఘనంగా ప్రారంభమై నూతన కమిటీ ఎన్నికతో సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పది మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

## యశోద హాస్పిటల్స్ ఆధ్వర్యంలో "రోబోటిక్-అసిస్టెడ్
## జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ"పై రెండు రోజుల
# "డెక్కన్ ఆర్థ్రోప్లాస్టీ సమ్మిట్ 2026" జాతీయ సదస్సు, లైవ్ వర్క్ షాప్

– 500 మందికి పైగా ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్లు, జాయింట్ రీప్లేస్మెంట్ నిపుణులు, వైద్య రంగ ప్రతినిధులతో యశోద హాస్పిటల్స్ జాతీయ "డెక్కన్ ఆర్థ్రోప్లాస్టీ సమ్మిట్ 2026" కాన్ఫరెన్స్ లైవ్ వర్క్ షాప్ విజయవంతం









**హైదరాబాద్, మే 16, 2026:** యశోద హాస్పిటల్స్-సికింద్రాబాద్ ఆధ్వర్యంలో రోబోటిక్-అసిస్టెడ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీ, కాంప్లెక్స్ ట్రామా మేనేజ్‌మెంట్, స్పోర్ట్స్ మెడిసిన్ మరియు ఆర్థ్రోప్లాస్టీ వైద్య రంగాలలో జరుగుతున్న అధునాతన సాంకేతిక పురోగతులు, వినూత్న శస్త్రచికిత్స విధానాలు, రోగుల సంరక్షణలో ఉత్తమ వైద్య పద్ధతులపై అవగాహన కల్పించే ప్రతిష్ఠాత్మక శాస్త్రీయ సదస్సు "డెక్కన్ ఆర్థ్రోప్లాస్టీ సమ్మిట్ 2026" ఈరోజు హోటల్ మ్యారీ గోల్డ్‌లో ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సును యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్. పవన్ గోరుకంటి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. మే 16 మరియు 17 తేదీలలో నిర్వహించబడుతున్న ఈ రెండు రోజుల జాతీయ స్థాయి సదస్సులో దేశవ్యాప్తంగా పేరొందిన 500 మందికి పైగా ఆర్థోపెడిక్ శస్త్రచికిత్స నిపుణులు, జాయింట్ రీప్లేస్‌మెంట్ స్పెషలిస్టులు పాల్గొననున్నారు. ఇంకా ఆర్థోపెడిక్ పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య విద్యార్థులు మరియు ఇంకా ఆరోగ్య రంగ నిపుణులు కూడా ఈ సదస్సులో పాల్గొని ఆర్థ్రోప్లాస్టీ వైద్య రంగంలోని తాజా పరిణామాలపై చర్చించారు. ఈ సందర్భంగా యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్. పవన్ గోరుకంటి మాట్లాడుతూ, "డెక్కన్ ఆర్థ్రోప్లాస్టీ సమ్మిట్ 2026 ద్వారా ఆర్థోపెడిక్ విద్య, శస్త్రచికిత్స నైపుణ్యం, అకాడెమిక్ సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని యశోద హాస్పిటల్స్ లక్ష్యంగా పెట్టుకుంది" అని అన్నారు. అనుభవజ్ఞులైన సర్జన్లు, యువ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు, వైద్య సిబ్బంది ఒకే వేదికపై కలిసి జాయింట్ రీప్లేస్‌మెంట్ రంగంలోని అత్యాధునిక పద్ధతులపై చర్చించేందుకు ఈ సమ్మిట్ ఎంతో ఉ పయోగపడుతుందని తెలిపారు.అలాగే, లైవ్ సర్జరీలు, నిపుణుల చర్చలు, ఇంటరాక్టివ్ సెషన్ల ద్వారా ఆధునిక శస్త్రచికిత్స విధానాలు, ప్రెసిషన్ ఆధారిత చికిత్సలు, రోగుల ఫలితాలను మెరుగుపరిచే సాంకేతికతలపై యువ వైద్యులకు ఈ సదస్సు ఎంతో దోహదపడుతుందని" యశోద హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్. పవన్ గోరుకంటి పేర్కొన్నారు. ఈ సదస్సు గురించి సికింద్రాబాద్-యశోద హాస్పిటల్స్ సీనియర్ ఆర్థోపెడిక్ & జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ టి. జయకృష్ణా రెడ్డి మాట్లాడుతూ, "కేస్ ఆధారిత లెర్నింగ్, ప్రాక్టికల్ సర్జికల్ డెమోన్స్ట్రేషన్స్ ద్వారా వైద్యులకు సమగ్ర అవగాహన కల్పించడం ఈ సదస్సు ప్రధాన ఉ ద్దేశ్యం. మోకాలి మరియు హిప్ జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సల్లో తాజా పురోగతులు, రోగి భద్రత, రిహాబిలిటేషన్ విధానాలు, మెరుగైన శస్త్రచికిత్స ఫలితాలపై ప్రత్యేకంగా చర్చిచామని తెలిపారు. సదస్సులో భాగంగా నిర్వహించిన రోబోటిక్ హిప్ మరియు మోకాలి జాయింట్ రీప్లేస్‌మెంట్ లైవ్ సర్జరీలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఆధునిక సర్జికల్ టెక్నిక్స్, అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించే రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ విధానాలపై పాల్గొన్న వైద్యులకు ప్రత్యక్ష అవగాహన కల్పించారని తెలియజేసారు. అలాగే ఇంటరాక్టివ్ కేస్-బేస్డ్ డిస్కషన్స్, ఆర్థ్రోప్లాస్టీలో ప్రస్తుత ధోరణులపై నిపుణుల ప్రసంగాలు, అడ్వాన్స్‌డ్ జాయింట్ రీకన్‌స్ట్రక్షన్ టెక్నిక్స్‌పై శాస్త్రీయ సెషన్స్ నిర్వహించామని" డాక్టర్ టి. జయకృష్ణా రెడ్డి తెలిపారు. **For further information, please contact Mr.Sampath on** 78930 53355 / 88971 96669

# డెంగ్యూ నివారణపై అవగాహాస ర్యాలీ



**ఖానాపురం మే16 (సాక్ష్యం న్యూస్ ) :** వరంగల్ జిల్లా ఖానాపురం ప్రాథమిక రోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ డెంగ్యూ జ్వరం ,దోమల నివారణ మరియు దోమలను నియంత్రణపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం మే 16న ఆరోగ్యం మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖజాతీయ కీటక జనిత వ్యాధుల నియంత్రణ కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.డెంగ్యూ వ్యాధి అనేది ప్రధానంగా నీరు నిలువ ఉన్న నీటిలో సంతానోత్పత్తి చేసే ఈడిస్ ఈజిప్ట్ దోమ ద్వారా వ్యాపించే ఒక వైరల్ ఇన్ఫెక్షన్ అని ,వర్షాకాలంలో మరియు తేమతో కూడిన నెలల్లో కేసులు గణనీయంగా పెరుగుతాయన్నారు.వ్యాధి ప్రబలకుండా నివారించడానికి ప్రజలను చైతన్యవంతం చేయాలని కోరారు.సమాజ భాగస్వామ్యంతో డెంగ్యూ నియంత్రణ చేయవచ్చునిపరిసరాలను పరిశీలించండి , శుభ్రంచేయండి ,కప్పిఉంచండి అనే థీమ్ ద్వారా సమాజ భాగస్వామ్యంతో దోమల నియంత్రణ చేపట్టవచ్చని తెలియజేశారు.నిలువ ఉన్న నీటిని తొలగించడం, దోమల జీవిత చక్రాన్ని విచ్చిన్నం చేయడానికి కూలర్లు, పూల కుండీలు, కొబ్బరి బోండా లు పాత టైర్లను తీసివేయడం మీరు నిల్వ ఉన్న పాత్రలను వారానికి రెండు సార్లు శుభ్రం చేయడం ద్వారాపగటిపూట కుట్టే దోమలను బారి నుండి రక్షణ పొందడానికి దోమలు నివారణ మందులు వాడడం, కిటికీలకు దోమ తెరలు వాడడం పొడవైన దుస్తులు ధరించడం వల్ల దోమ కాటు నుండి రక్షణ కలుగుతుందనితెలిపారు. అధిక జ్వరం తీవ్రమైన తలనొప్పి, కండరాలు నొప్పులు, దద్దుర్లు వంటివి సంభవిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ దామోదర్ రెడ్డి నర్సింగ్ ఆఫీసర్స్ చిన్ని,హేమలత,సబిత ఫార్మసీ ఆఫీసర్ శ్రీనివాస్ చారి వైద్య సిబ్బంది భాస్కర్, ఫరోషిని, విజయరాణి, వినోద,జ్యోతి,రమాదేవి, హరికిషన్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

# బైండోవర్ ఐన ఆగని "మట్టి దందా"

– యథేచ్ఛగా మొరం దందా – పట్టించుకోని అధికారులు





**ఖానాపురం మే16 (సాక్ష్యం న్యూస్) :** వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలో మట్టి దందా యథేచ్ఛగా సాగుతోంది .ఖానాపురం మండలంలోని బుధరావుపేట ,మంగళావారిపేట , పరిసర ప్రాంతాలలోని అటవీ భూములు ,అసైన్డ్ భూములలో అనుమతులు లేకుండా మట్టి త్రవ్వి అక్రమంగా తరలించి మొరం వ్యాపారం జోరుగా సాగించారు. ఈక్రమంలో పలు ఫిర్యాదులు అందడంతో స్థానిక పోలీసులు మొరం వ్యాపారం సాగించే 9మందిని గుర్తించారు. వారిని గత నెల20న రూ.లక్ష పూచీకత్తుపై తహశీల్ధార్ రమేష్ ముందు బైండోవర్ చేశారు. ఐనప్పటికి మట్టి దందా యథావిధిగా సాగుతోందని పలువురు విమర్శిస్తున్నారు. రాత్రి వేళల్లో భారీగా మట్టిని తరలిస్తు సొమ్ము చేసుకుంటున్నారు. మొరం స్మగ్లర్లు బైండోవర్ ఐనప్పటికి రైతుల పేరుతో ఫామాయిల్ తోటలో దారులకు మొరం పోయడానికి అనుమతులు తీసుకుని దుర్వినియోగానికి పాల్పడుతూ తమ దందాను సాగిస్తున్నట్లు తెలిసింది. గ్రామాలలోని పలువురికి మట్టి విక్రయాలు సాగించారు. కొంతమంది రైతులను అధికారుల వద్దకు పంపి పామాయిల్ తోటకు మట్టి దారుల వంకతో అనుమతులు పొందిన మొరం స్మగ్లర్ వారి తరపున వ్యవహరించే వ్యక్తులు, ఈ అనుమతులను దుర్వినియోగం చేస్తూ, తమ తోటలకు అవసరమైన దానికంటే ఎక్కువ మొరం తవ్వి, దానిని బయటి మార్కెట్‌లో అక్రమంగా విక్రయిస్తున్నారు.ఈ అక్రమ వ్యాపారం వల్ల ప్రభుత్వానికి భారీగా నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వానికి ఒక క్యూబిక్ మీటరుకు 150 రూపాయలు ప్రభుత్వానికి చెల్లించవలసి ఉ ండగా దానిని రైతుల పేరుతో ఎగనామం పెడుతున్నారు.ఉ దాహరణకు ఒక టాక్టర్లులో మూడు క్యూబిక్ మీటర్లు450/- ఒక టిప్పర్ కు 18 క్యూబిక్ మీటర్లు 2700 రూపాయలు ఉండగాదానిని రైతుల పేరుతో తవ్వకాలకు సరైన పన్నులు చెల్లించకపోవడం, అనుమతులను ఉ ల్లంఘించడం వంటి కారణాల వల్ల ప్రభుత్వం కోట్లాది రూపాయల ఆదాయాన్ని కోల్పోతోంది. అంతేకాకుండా, ఈ అక్రమ తవ్వకాల వల్ల పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం జరుగుతోంది. అటవీ ప్రాంతాలు, వ్యవసాయ భూములు దెబ్బతినడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. అంతేగాక గత రెండు రోజులుగా రాత్రింబవళ్ళు అక్రమంగా మట్టి రవాణా సాగుతుంది. ఖానాపురం మండలంలోని వేపచెట్టు తండా సమీపంలో మట్టి త్రవ్వకాలపై అందిన సమాచారం మేరకు పోలీసులు అట్టి వాహానాలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇట్టి సంఘటనపై పోలీసుల నుండి సమాచారం అందాల్సి ఉంది. అధికారులు ఈ అక్రమ వ్యాపారంపై దృష్టి సారించి, కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అనుమతులను దుర్వినియోగం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం, మొరం తవ్వకాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయడం ద్వారా ఈ అక్రమ వ్యాపారాన్ని అరికట్టవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# దాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన ఏఎస్పీ మనన్ బట్



**ఏటూరునాగారం, మే 16, (సాక్ష్యం) :** ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని దాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం ఆకస్మిక తనిఖీ చేసిన ఏఎస్పీ మనన్ బట్.మండలంలోని ఆకులవారి ఘణపురం, ఏటూరునాగారం దాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఎస్పీ మనన్ భట్ తమ సిబ్బందితో పరిశీలించి కళ్ళాల్లోని పరిస్థితులు రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రంలో దాన్యం కళ్ళాలు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు లారీలలో లోడ్ చేసి మిల్ లకు తరలించాలని, మ్యాచర్ పేరుతో రైతులకు మోసాలు జరిగితే తమ దృష్టికి తీసుకురావాలని ఏఎస్పీ సెంటర్ నిర్వాహకులకు సూచించారు. అంతేకాకుండా దాన్యం లోడ్ లు మిల్ లకు తరలించడానికి లారీల కొరత ఉంటే పోలీసుల సహకారం తీసుకోవాలని సెంటర్ ఇంచార్జ్ సాంబరావుకు తెలిపారు. ఈ తనిఖీలలో ఏఎస్పీతో పాటు సీఐ అనుముల శ్రీనివాసు, ఎస్సై మహేష్, పోలీసు సిబ్బంది ఉన్నారు.



## రిషి డ్యాన్స్ అకాడమీ సమ్మర్ క్యాంప్

– విద్యార్థుల భారీ స్పందన – పేరిణి నాట్యం, భరత నాట్యం, సినీ నృత్యాలు

– డ్యాన్స్ మాస్టర్ పేరిణి నాగేశ్వరరావు









**కోదాడ మే 16, (సాక్ష్యం)** కోదాడ పట్టణంలోని హుజూర్ నగర్ రోడ్డులో సిటీ యూనియన్ బ్యాంక్ వెనుక, తార టీ స్టాల్ పక్కన ఏర్పాటుచేసిన రిషి డ్యాన్స్ అకాడమీలో 45 రోజుల సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు డ్యాన్స్ మాస్టర్ పేరిణి నాగేశ్వరరావు శనివారం తెలిపారు. ఈ సమ్మర్ క్యాంప్ కు విద్యార్థుల నుండి భారీ స్పందన లభిస్తుందన్నారు. పేరిణి నాట్యం, భరత నాట్యం, తెలంగాణ నృత్యాలు, మహిళలకు ఎరోబిక్స్, పేరిణి శివతాండవం, జానపదం, స్నీ మోడ్రన్ డ్యాన్స్ లు నేర్పిస్తున్నట్లు తలిపారు. కోదాడతో పాటు పరిసర ప్రాంతాల నుండి భారీ ఎత్తున చిన్నారులు డ్యాన్స్ నేర్చుకోవడానికి రిషి డ్యాన్స్ అకాడమీలో క్యూ కడుతున్నారు. ఎన్నో సంవత్సరాల అనుభవం ఉన్న రిషీ డ్యాన్స్ అకాడమీ పేరిణి నాగేశ్వరరావు పట్ల తల్లిదండ్రులకు ఉన్న నమ్మకం కారణంగా ఇది సాధ్యమైంది. పేరిణి నాట్యం, భరత నాట్యం, తెలంగాణ నృత్యాలు, మహిళలకు ఎరోబిక్స్, పేరిణి శివతాండవం, జానపదం, స్నీ మోడ్రన్ డ్యాన్స్ లు నేర్చుకునేందుకు విద్యార్థులు, మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారని రిషీ డ్యాన్స్ అకాడమీ పేరిణి నాగేశ్వరరావు తెలిపారు.

**ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి : రిషీ డ్యాన్స్ అకాడమీ పేరిణి నాగేశ్వరరావు**

పిల్లలకు చదువుతో పాటు రోగ్యం మంచి భవిష్యత్ కనబర్చిన దృక్పదం సమాజంలో తద్వారా సంక్రమించే భారతీయ సంస్కృతి సంప్రదాయాల మేలుక లయికే మీ పిల్లలను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు దోహదపడుతుంది. వారిలో అంతర్ లీలంగా నిగిడి దాగివున్న అభిష్టాలను, శక్తులను వెలికి తీసేందుకు మేము చేసే ఈ చిన్ని ప్రయత్నానికి సహకారం అందించాలని కోరుచూ తగిన రీతిలో నృత్యాలు నేర్పించుటకు మీ ముందుకు వచ్చింది. రిషీ డ్యాన్స్ అకాడమీ పేరిణి నాగేశ్వరరావు 98482 32689 నెంబరులో సంప్రదించాలన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచింది

– బిజెపి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి



**కోదాడ మే 16, (సాక్ష్యం)** రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక రైతులను నట్టేట ముంచిందని బిజెపి కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు గోలి మధుసూదన్ రెడ్డి విమర్శించారు. శనివారం అల్వాల పురం గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఏ ఒక్క రైతుకైనా రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిస్థాయిలో చేశారా అని ప్రశ్నించారు. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలపై ఎక్కడైనా చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. రుణమాఫీ కాకపోవడం వల్ల బ్యాంకుల అప్పులు పెరిగి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొత్త రుణాలు రాక ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీని కూడా ప్రభుత్వం విస్మరించిందని మండిపడ్డారు. రైతులు పండించిన చివర గింజ వరకు కేంద్ర ప్రభుత్వం డబ్బులు చెల్లించేందుకు సిద్ధంగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యంతో మిల్లర్లు, అధికారులు కలిసి కుమ్మక్కయి రైతులను నట్టేట ముంచారన్నారు. ఇప్పటికైనా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలో అమలు చేయాలని,రాబోయే వానాకాలం సీజన్ నుండి నాణ్యమైన విత్తనాలు అందేలా చర్యలు తీసుకోవాలని, అలాగే సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అగ్రికల్చర్ ఆఫీసర్లు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. అన్ని రకాల పంటలకు మద్దతు ధర పెంచినందుకు కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మామిడి తోటలను పరిశీలించారు. ఈ సమావేశంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కోశాధికారి అశోక్ రెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వెలివోలు చిట్టిబాబు, సీనియర్ నాయకులు కనగాల వెంకటరామయ్య, బొలిశెట్టి కృష్ణయ్య, కనగాల నారాయణ, యడ్లపల్లి రామారావు, వెంకట నరసయ్య, గోదేశీ లక్ష్మణ్, శంకర్ పాల్గొన్నారు.

## కళ్యాణం తంతులో మాంగళ్యధారణ చూపిస్తున్న పూజారి





**యాదగిరి కొండ సాక్ష్యం న్యూస్..** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మి నరసింహ స్వామి వారి సన్నిధిలో వీకెండ్ సెలవులు రావటంతో యాదాద్రి ఆలయ సన్నిధిలో భక్తులరద్దీ పెరిగింది.వేకువ జామున ఉదయాన్నే స్వామివారి దర్శనానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయానికి భక్తుల రద్దీ పెరగడంతో స్వామి వారి ధర్మ దర్శనంకు 2గంటల సమయం ప్రత్యేక ప్రవేశ దర్శనంకి ఒక గంట సమయంపడుతోంది. క్షేత్ర పరిసరాలు భక్తుల సందడి కనిపిస్తుంది. దర్శన క్యూలైన్లు,ఆలయ మాఢ వీధుల్లు,కళ్యాణకట్ట, పుష్కరిణి,కొండపైబస్టాండ్, వ్రత మండపం ఘాట్ రోడ్డు వెంట భక్తులతో కిటకిటలాడుతున్నవి.. ఆలయంలో స్వామివారి నిత్య కళ్యాణం పర్వంలో సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనం భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

## వారాంతపు సేవ శ్రీ ఆంజనేయ స్వామి వారికి ఆకు పూజ





**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానం శ్రీ పర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి వారి ఆలయము నందు శనివారం రోజు నుండి నూతనముగా వారాంతపు సేవ శ్రీ ఆంజనేయ స్వామి వారి ఆకు పూజ కార్యక్రమము నిర్వహించుట ప్రారంభించుట జరిగినది. ప్రతి శనివారం ఉదయం 11.00 గంటల నుండి 12.00 వరకునిర్వహించబడును. టికెట్ వెల 250/- అని ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ లు రాజన్ బాబు, శంకర్ నాయక్, రాజు, భక్తులు పాల్గొన్నారు.

## డెంగ్యూ వ్యాధి వ్యాప్తిని అరికట్టాలి

– జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా



**వరంగల్,16 మే (సాక్ష్యం)** శనివారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చింతల్, వరంగల్ పరిధిలో డెంగ్యూ వ్యాధి అరికట్టాలని ర్యాలీ, సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఈ సంవత్సర నినాదం సమాజంలో అందరూ ఐక్యంగా నివారణ చర్యలు చేపట్టడం ద్వారా డెంగ్యూ వ్యాధిని నిర్మూలించడంఇతో డెంగ్యూ రహిత సమాజం కోసం కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనశాలను తిలకించి సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నివారణ కోసం ప్రజలకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, వ్యాధి చికిత్స కంటే వ్యాధి నివారణ ముఖ్యమని తెలిపారు. అదేవిధంగా రానున్న వర్షాకాలము ను దృష్టిలో ఉంచుకొని ఇప్పటినుండి వ్యాధి ప్రభావిత ప్రాంతాలలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, వైద్య సిబ్బంది ఇంటింటి జ్వర సర్వే నిర్వహించి రక్త పరీక్షలు చేయాలని తెలిపారు. డెంగ్యూ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా త్వరగా కోలుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు,డిప్యూటీ డిఎం,హెచ్ఓ డాక్టర్ ప్రకాష్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ఇఫ్తికార్ అహమ్మద్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ అరుణ్, డాక్టర్ దిలీప్, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు కమిటీ ఏర్పాటు పట్ల హర్షం

– ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు రాయపూడి వెంకట్ నారాయణ



**కోదాడ మే 16,( సాక్ష్యం)** తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను గుర్తించి వారి పోరాటపటిమను గుర్తించవలసిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఒక కమిటీని నియమించినందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు రాయపూడి వెంకట్ నారాయణ హర్షం వెలిబుచ్చారు. శనివారం యన కోదాడలో మాట్లాడుతూ ఉద్యమకారుల త్యాగాల పునాదుల మీద ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎటువంటి న్యాయం చేయలేకపోయారని వారికి కనీస గౌరవం కూడా లభించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేస్తామని 250 చదరపు గజముల స్థలము మరియు పెన్షన్లు నామినేటెడ్ పదవులు ఇస్తామని హామీ ఇచ్చారు కానీ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరం లు అయిపోయిన ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని ప్రభుత్వం కేకే గారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కమిటీ తొందరగా ఉద్యమకారులను గుర్తించి విధివిధానాలు నిర్ణయించవలసిందిగా కోరినారు ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులు నేడు బిచ్చమెత్తుకునే పరిస్థితిలో ఉన్నారని ఆయన అన్నారు ఉద్యమంలో అమరులైన అమరవీరులకు కుటుంబాలకు మరియు అంగవైకల్యం పొందిన వారికి బైండోవర్ కేసులో ఉన్న వారికి ఎఫ్ఐఆర్ లు ఉన్నవారికి మొదటగా న్యాయం చేయాలని అన్నారు.

## పెట్రోల్, డీజిల్ ధరల పెంపు పై భగ్గుమన్న బీఆర్ఎస్





**వరంగల్, 16 మే (సాక్ష్యం)** దేశంలో, రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ రేట్లను విచ్చలవిడిగా పెంచుతూ సామాన్య ప్రజలపై పెను భారం మోపిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బీఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు , వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు శనివారం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు.వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని కాశిబుగ్గ పరిధిలో గల వివేకానంద జూనియర్ కాలేజ్ పక్కన ఉన్న పెట్రోల్ బంక్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు భారీ ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించాయి. వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు నన్నపునేని నరేందర్ నాయకత్వంలో జరిగిన ఈ ధర్నాలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు చేశారు. “పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలి”, “సామాన్యుడిపై భారం మోపిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి నశించాలి” అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 12 ఏళ్లలో రూ. 43 లక్షల కోట్ల దోపిడీ: ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగియగానే పెట్రోల్, డీజిల్ రేట్లు పెంచి సామాన్యుడి నడ్డి విరిచారని మండిపడ్డారు. గత 12 ఏళ్లలో పెట్రోల్, డీజిల్ రేట్లను ఏకంగా 32 రూపాయలు పెంచి, దేశ ప్రజల నుంచి రూ. 43 లక్షల కోట్లు కొల్లగొట్టిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీదేనని విమర్శించారు.

**కార్పొరేట్ దొంగల గురువు మోదీ**

నీరవ్ మోదీ, విజయ్ మాల్యా వంటి ఆర్థిక నేరగాళ్లకు చెందిన కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్ల రూపాయల అప్పులను మాఫీ చేస్తున్న కేంద్ర ప్రభుత్వం, సామాన్య ప్రజలను మాత్రం నిలువునా దోచుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. “ఇదేనా మోదీ.. మీ దేశం కోసం.. ధర్మం కోసం..?” అని ప్రశ్నించారు. మోదీ దేశ గురువు కాదు.. దేశ ప్రజల జేబులు కొల్లగొడుతున్న కార్పొరేట్ దొంగల గురువు అని దుయ్యబట్టారు.

**సీఎం రేవంత్ రెడ్డిపై విమర్శలు**

గతంలో కేసీఆర్ పై పొడుగు పొడుగు మాటలు మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు పెట్రోల్‌పై సబ్సిడీ ఎందుకు మాఫీ చేయడం లేదని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వైఖరిని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. పెట్రోల్, డీజిల్ రేట్ల పెంపుపై వరంగల్ బీజేపీ, కాంగ్రెస్ నాయకులు ఎందుకు మాట్లాడడం లేదన్నారు.

**గద్దె దించడం ఖాయం**

సామాన్య ప్రజలను ఇటు కేంద్రంలో, అటు రాష్ట్రంలో దోచుకుంటున్న బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలకు ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని, 2029 ఎన్నికల్లో ఈ రెండు పార్టీలను గద్దె దించడం ఖాయమని స్పష్టం చేశారు. శ్రీరాముడు, దేవుళ్ల పేరుతో రాజకీయం చేస్తూ ప్రజలను పీడిస్తున్న ఈ బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ప్రజలకు త్వరలోనే విముక్తి కలగాలని ఆకాంక్షించారు. ఈ ధర్నా కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు భారీ సంఖ్యలో కార్యకర్తలు, సామాన్య ప్రజలు పాల్గొని తమ నిరసనను తెలియజేశారు.

## వరి ధాన్యం కొనుగోలు తూకంలో జరిగే దోపిడిని అరికట్టాలి

– రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బూరుగు కృష్ణారెడ్డి



**చౌటుప్పల్ మే 16 (సాక్ష్యం)** చౌటుప్పల్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు లో ధాన్యం కొనుగోలు చేస్తూ తూకంలో జరిగే దోపిడిని అరికట్టాలని రైతు సంఘం చౌటుప్పల్ వారి ఆధ్వర్యంలో మార్కెట్ యార్డులో ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర నాయకులు బూరుగు కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రైతులు అష్ట కష్టాలు పడి పండించినటువంటి పంటలు మార్కెట్ తీసుకువెళ్తే రైతులను తూకం వేసేటప్పుడు మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు ధాన్యం వే బ్రిడ్జి కాంటాలను పట్టుకొని ఒక లారీ లో మూడు క్వింటాల 70 కేజీలు ధాన్యము తూకంలో తేడా వచ్చిందని తెలిపారు.ఏ సమయంలో వర్షాలు వస్తాయో అర్థం కావడం తెలియక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కావున ప్రభుత్వ అధికారులు మిల్లర్ల పై చర్య తీసుకుని రైతుల ధాన్యాన్ని కొనుగోలు వేగవంతము చేయాలని డిమాండ్ చేశారు. ఇది ఇలా ఉంటే చౌటుప్పల్ ఎమ్మార్వో, ఆర్ఐ అక్కడికి చేరుకొని వే బ్రిడ్జిని పరిశీలించి సరి చేయడం విశేషం. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు దోనూరి నర్సిరెడ్డి, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చీరిక అలివేలు, సింగిల్ విండో డైరెక్టర్ బోరం నర్సిరెడ్డి, మాజీ సింగల్ విండో చైర్మన్ చీరిక సంజీవరెడ్డి, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు పొట్ట శ్రీనివాస్, రైతు సంఘం నాయకులు జక్కిడి గోపాల్ రెడ్డి, ఆకుల ధర్మయ్య, బత్తుల దాసు, బోయ యాదయ్య, బొక్క యాదిరెడ్డి, నరసింహ, శంకరయ్య, లక్ష్మమ్మ, యాదయ్య, రైతులు పాల్గొన్నారు.

## దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద

**వరంగల్, 16 మే (సాక్ష్యం)** వరంగల్ జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శంభునిపేటలో శనివారం సమగ్ర శిక్ష తెలంగాణ (దివ్యాంగుల ఉపకరణాల సంస్థ) సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు సహాయక ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద పాల్గొని దివ్యాంగులకు 115 సహాయక ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు ఎప్పుడూ ఆత్మస్థైర్యం కోల్పోకూడదని, జీవితంలో ఎల్లప్పుడూ సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. దివ్యాంగులకు దేవుడు అసాధారణ ప్రతిభను ప్రసాదించాడని, ఆ ప్రతిభను వెలికితీయడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన మనోవికాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గత విద్యా సంవత్సరంలో ఆగస్టు నెలలో నిర్వహించిన అసెస్‌మెంట్ క్యాంపులో అర్హులుగా గుర్తించిన 99 మంది దివ్యాంగ విద్యార్థులకు గాను మొత్తం 115 సహాయక ఉపకరణాలను పంపిణీ చేశారు. ఈ ఉపకరణాలలో బ్రెయిలీ కిట్లు, మొబైల్ ఫోన్లు, వీల్ చెయిర్లు, వినికిడి యంత్రాలు ఇతర అవసరమైన ఉపకరణాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, డా. కె. శ్రీనివాస్, డా. సాంబశివరావు మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రఫీక్,ప్రత్యేక ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.







# చెన్నై ప్లేఆఫ్స్ ఆశలకు గట్టి దెబ్బ!

ఐపీఎల్ 2026 సీజన్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్స్ ఆశలకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. శుక్రవారం లక్నో వేదికగా జరిగిన మ్యాచ్‌లో రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలోని సీఎస్కే జట్టు లక్నో సూపర్ జెయింట్స్ చేతిలో 7 వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. ఈ ఓటమితో చెన్నై పాయింట్ల పట్టికలో ఆరో స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం చెన్నై ఖాతాలో 12 పాయింట్లు ఉన్నాయి. రాజస్థాన్ రాయల్స్ కూడా సమాన పాయింట్లతో ఉన్నప్పటికీ, నెట్ రన్ రేట్ తక్కువగా ఉండటం వల్ల చెన్నై ఒక స్థానాన్ని కోల్పోవాల్సి వచ్చింది. లక్నో చేతిలో ఊహించని రీతిలో ఓడిపోవడం చెన్నై ఫ్యాన్స్‌ను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఈ ఓటమి తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ ముందున్న సమీకరణాలు చాలా కష్టంగా మారాయి. సీఎస్కే ఇంకా రెండు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఈ రెండు మ్యాచ్‌లలో వారు సన్‌రైజర్స్ హైదరాబాద్, గుజరాత్ టైటాన్స్ జట్లతో తలపడనున్నారు. ఒకవేళ చెన్నై ఈ రెండు మ్యాచ్‌ల్లోనూ విజయం సాధిస్తే 14 మ్యాచ్‌లకు గానూ 16 పాయింట్లు సాధిస్తుంది. టాప్ 4 లో నిలిచి ప్లేఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకోవడానికి 16 పాయింట్లు సాధారణంగా సరిపోతాయి. అయితే ప్రస్తుతం టోర్నీలో ఐదు జట్లకు 16 లేదా అంతకంటే ఎక్కువ పాయింట్లు సాధించే అవకాశం ఉండటం వల్ల చెన్నైకి తీవ్రమైన పోటీ ఎదురవుతుంది. ఒకవేళ రాబోయే రెండు మ్యాచ్‌ల్లో ఒక్కటి మాత్రమే గెలిస్తే చెన్నై 14 పాయింట్లతోనే ఆగిపోతుంది. ఆ పరిస్థితిలో ప్లేఆఫ్స్ చేరడం దాదాపు అసాధ్యం అవుతుంది. అప్పుడు మిగిలిన జట్ల మ్యాచ్ ఫలితాలు, నెట్ రన్ రేట్ పైనే పూర్తిగా ఆధారపడాల్సి ఉంటుంది. ఈ ఘోర పరాజయంపై చెన్నై కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ మ్యాచ్ అనంతరం స్పందించాడు. "ప్రస్తుతం మా ముందున్న మొదటి ఛాలెంజ్ చెన్నై చేరుకోవడం, ఎందుకంటే ఇది చాలా లాంగ్ ఫ్లైట్. ఆ తర్వాత మేము హోమ్ గ్రౌండ్ లో ప్రాక్టీస్ చేసి, ఏయే విభాగాల్లో ఇంప్రూవ్ అవ్వాలో వాటిపై ఫోకస్ పెడతాము. చెన్నై పిచ్ కండిషన్స్ కు త్వరగా అలవాటు పడటం ముఖ్యం. మా ముందున్న లెక్కలు చాలా సింపుల్. ఇకపై మేము ఆడే ప్రతి మ్యాచ్‌ను ఖచ్చితంగా గెలవాలి. ఇందులో ఎలాంటి కన్ఫ్యూజన్ లేదు, అంతా చాలా స్పష్టంగా ఉంది. ఆందోళన చెందాల్సిన పని లేదు, మాకు ఒక మంచి రోజు కలిసి వస్తే చాలు. ఎవరైతే ఫామ్ లో ఉంటారో వారు మ్యాచ్‌ను గెలిపించేలా ఆడాలి. రాబోయే మ్యాచ్‌ల్లో ఖచ్చితంగా పుంజుకుంటామనే నమ్మకం ఉంది" అని రుతురాజ్ ధీమా వ్యక్తం చేశాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన చెన్నై సూపర్ కింగ్స్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. చెన్నై బ్యాటర్ కార్తీక్ శర్మ అదిరిపోయే హాఫ్ సెంచరీతో రాణించి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించాడు. లక్నో బౌలర్ ఆకాష్ సింగ్ తన పాత జట్టుపై అద్భుతంగా బౌలింగ్ చేసి 3 వికెట్లు పడగొట్టాడు. ఆ తర్వాత 188 పరుగుల టార్గెట్ తో బరిలోకి దిగిన లక్నో సూపర్ జెయింట్స్ బ్యాటర్లు చెన్నై బౌలర్లపై విరుచుకుపడ్డారు. ముఖ్యంగా మిషెల్ మార్ష్ కేవలం 38 బంతుల్లోనే 90 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. అతడికి తోడుగా జోష్ ఇంగ్లిస్ 36 పరుగులతో రాణించడంతో లక్నో మరో మూడు ఓవర్లు మిగిలి ఉండగానే టార్గెట్ ఛేజ్ చేసింది. నిజానికి లక్నో ఈ మ్యాచ్‌కు ముందే ప్లేఆఫ్స్ రేసు నుండి అధికారికంగా ఎలిమినేట్ అయిపోయింది, కానీ చెన్నైని ఓడించి వారి అవకాశాలను దెబ్బతీసింది.

## ఐపీఎల్ ఫైనల్‌కు పీసీబీ చీఫ్ నఖ్వీ..?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్ 2026) ముగింపు దశకు చేరుకున్న వేళ క్రికెట్ ప్రపంచంలో ఒక ఊహించని పరిణామం చోటుచేసుకుంది. అహ్మదాబాద్ వేదికగా మే 30, 31 తేదీల్లో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) కీలక బోర్డు సమావేశాలు జరగనున్నాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా తొలుత దోహాలో జరగాల్సిన ఈ సమావేశాలను ఐసీసీ అహ్మదాబాద్‌కు మార్చింది. ఐసీసీ నిబంధనల ప్రకారం సభ్య దేశాల ప్రతినిధులందరికీ ఆహ్వానాలు వెళ్లాయి. ఇందులో భాగంగానే పీసీబీ ఛైర్మన్, ప్రస్తుత పాకిస్తాన్ అంతర్గత వ్యవహారాల మంత్రి మొహ్సిన్ నఖ్వీకి కూడా భారత్ రావాల్సిందిగా పిలుపు అందింది. ఐసీసీ సమావేశాలతో పాటు నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగే ఐపీఎల్ 2026 మేగా ఫైనల్‌ను వీక్షించేందుకు కూడా నఖ్వీకి ఆహ్వానం అందినట్లు వార్తలు వస్తున్నాయి. ఇది బీసీసీఐ వ్యక్తిగతంగా పంపిన ఆహ్వానం కాకపోయినప్పటికీ, భారత్–పాక్ మధ్య ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో ఆయన రాక పెద్ద చర్చనీయాంశంగా మారింది. అయితే, ఆయన భారత్ పర్యటనకు వస్తారా లేదా అనేది పాక్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉందని అక్కడి మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. మొహ్సిన్ నఖ్వీ భారత్ రాకపై వార్తలు రాగానే, గతేడాది జరిగిన ఆసియా కప్ వివాదాన్ని అభిమానులు మళ్లీ తెరపైకి తెచ్చారు. ఆసియా కప్ 2025 టోర్నీ సమయంలో జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి కారణంగా భారత ఆటగాళ్లు పాకిస్తాన్ ఆటగాళ్లతో కరచాలనం చేయడానికి నిరాకరించారు. ఆ తర్వాత ఫైనల్ గెలిచిన భారత్ ప్రెజెంటేషన్ వేడుకల్లో పీసీబీ ఛైర్మన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని అందుకోవడానికి ఇష్టపడలేదని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఆ సమయంలో తీవ్ర అసంతృప్తికి లోనైన నఖ్వీ, ట్రోఫీని, మెడల్స్‌ను తీసుకుని మైదానాన్ని వీడిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఆ ప్రతిష్టాత్మక ఆసియా కప్ ట్రోఫీ పీసీబీ ఆదేశాల మేరకు దుబాయ్‌లోని ఒక లాకర్‌లో బంధించి ఉంచినట్లు వార్తలు వచ్చాయి. దీనిపై బీసీసీఐ ఐసీసీకి ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో నఖ్వీ భారత్ పర్యటన వార్తలపై భారత క్రికెట్ అభిమానులు సోషల్ మీడియాలో గట్టిగా స్పందిస్తున్నారు. "నఖ్వీ గారూ.. భారత్‌కు వస్తే కరచాలనాలు వద్దు కానీ, మా ఆసియా కప్ ట్రోఫీని మాత్రం మాతో పాటే తీసుకురండి" అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. "భారత్ రావాలనుకుంటే ఒట్టి చేతులతో కాదు, ఆసియా కప్‌తో పాటు ఆటగాళ్లకు ఇవ్వాల్సిన మెడల్స్ కూడా వెంట పెట్టుకుని రావాలి" అని మరికొందరు హెచ్చరిస్తున్నారు. రాజకీయంగా, క్రికెట్ పరంగా భారత్–పాక్ మధ్య సంబంధాలు క్షీణించిన తరుణంలో మొహ్సిన్ నఖ్వీ అహ్మదాబాద్‌కు రావడం అనేది అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. క్రీడా స్ఫూర్తిని పక్కనబెట్టి ట్రోఫీని లాకర్‌లో దాచిన పాక్ బోర్డుకు, భారత అభిమానులు సోషల్ మీడియా వేదికగా సరైన సమాధానమే ఇస్తున్నారు. మరి పాక్ ప్రధాని ఈ పర్యటనకు గ్రీన్ సిగ్నల్ ఇస్తారో లేదో వేచి చూడాలి.





## మిచెల్ మార్ష్ విధ్వంసం

చెన్నై సూపర్ కింగ్స్ జోరుకు బ్రేక్ పడింది. హ్యాట్రిక్ విజయాలతో జోష్‌మీదున్న ఆ జట్టుకు లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ తాజాగా షాకిచ్చింది. గత మ్యాచ్ ఓటమికి ప్రతీకారం తీర్చుకుంటూ, చెన్నై నిర్దేశించిన 188 పరుగుల టార్గెట్‌ను లఖ్‌నవూ 16.4 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఈజీగా ఛేదించేసింది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (90 పరుగులు) ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. నికోలస్ పూరన్ (32) చెన్నై బౌలర్లలో ముకేశ్ చౌదరి, స్పెన్సర్ జాన్సన్ చెరో వికెట్ దక్కించుకున్నారు. తొలుత చెన్నై ఇన్నింగ్స్ పడుతూ లేస్తూ సాగింది. 20 ఓవర్లలో సీఎస్కే 5 వికెట్లకు 187 పరుగులు చేసింది. కార్తిక్ శర్మ (71 పరుగులు, 42 బంతుల్లో) సూపర్ హాఫ్ సెంచరీకి తోడు చివర్లో డివాల్డ్ బ్రెవిస్ (25 పరుగులు), శివమ్ దూబే (32 పరుగులు) మెరుపులు తోడయ్యాయి. దీంతో ఆ జట్టు స్కోర్ 180ం నమోదైంది. సంజు శాంసన్ (20), రుతురాజ్ (13), ఉర్విల్ పటేల్ (6) విఫలమయ్యారు. లఖ్‌నవూ బౌలర్లలో మహారాజ్ సింగ్ 3, మహ్మద్ షమీ, షహబాజ్ అహ్మద్ చెరో 1 వికెట్ పడగొట్టారు. ఈ సీజన్‌లో ఇప్పటికే ప్లేఆఫ్స్ రేసు నుంచి అధికారికంగా దూరమైన జట్లు ముంబయి ఇండియన్స్, లఖ్‌నవూ సూపర్ జెయింట్స్. అయితే నిన్న ప్లేఆఫ్స్ రేసులో ముందుకెళ్లే అవకాశం ఉన్న పంజాబ్ జట్టును ముంబయి మట్టికరిపించి ఆ జట్టు అవకాశాలను కొంతవరకు దెబ్బతీసింది. ఇప్పుడు తాజా మ్యాచ్‌లో చెన్నైని చిత్తు చేసిన లఖ్‌నవూ ఆ టీమ్ ఛాన్స్‌లను కూడా సంక్లిష్టం చేసింది. ప్రస్తుతం 12 మ్యాచ్‌ల్లో ఆరు విజయాలతో 12 పాయింట్లతో సీఎస్కే ఆరో స్థానానికి పడిపోయింది. దీంతో ప్లేఆఫ్స్‌కు చేరాలంటే మిగిలిన రెండు మ్యాచ్‌ల్లోనూ నెగ్గాల్సిన పరిస్థితి ఏర్పడింది. చెన్నై తమ తదుపరి మ్యాచ్‌లు సన్‌రైజర్స్, గుజరాత్‌తో ఆడాల్సి ఉంది. అయితే సన్ రైజర్స్, గుజరాత్ కూడా ప్లే ఆఫ్స్ రేసులో ఉండడంతో ఈ మ్యాచ్‌లు రసవత్తరంగా ఉండే ఛాన్స్ ఉంది. ఐపీఎల్ హిస్టరీలో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ సక్సెస్‌ఫుల్‌గా ఛేజ్ చేసిన టాప్ 5 భారీ టార్గెట్ ఇదే. అయితే ఈ లిస్ట్‌లో టాప్ 5లో మూడు చెన్నైపైనే సాధించింది. ఆ జట్టు ఐపీఎల్‌లో ఛేదించిన అతిపెద్ద స్కోర్ 213. 2023 ఎడిషన్‌లో ఆర్సీబీపై ఈ ఫీట్ నమోదైంది. ఈ మ్యాచ్‌లో చెన్నై బౌలర్ అన్షుల్ కంబోజ్ 2.4 ఓవర్లలోనే వికెట్ లేకుండా 63 పరుగులు ఇచ్చాడు. చెన్నై తరపున ఐపీఎల్‌లో అత్యధిక పరుగులు ఇచ్చిన లిస్ట్‌లో రెండో స్థానంలో అన్షుల్ నిలిచాడు. ఇందులో అతడు 8 సిక్స్‌లు ఇచ్చాడు. గతేడాది ఆర్సీబీపై ఖలీల్ అహ్మద్ 3 ఓవర్లు బౌలింగ్ వికెట్ లేకుండా చేసి 65 పరుగులు ఇచ్చుకున్నాడు.



## కోహ్లీ, ధోనీ సరసన సునీల్ నరైన్..

ధనాధన్ లీగ్‌లో భాగంగా ఈడెన్ గార్డెన్స్ వేదికగా గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్ నరైన్ కెరీర్‌లో ఒక మధుర జ్ఞాపకంగా మిగిలిపోనుంది. కోల్‌కతా నైట్ రైడర్స్ తరపున అతడికి ఇది 200వ ఐపీఎల్ మ్యాచ్. లీగ్ చరిత్రలో ఒకే జట్టు తరపున ఈ మైలురాయిని అందుకున్న నలుగురు అగ్రశ్రేణి ఆటగాళ్ల జాబితాలోకి నరైన్ చేరిపోయాడు. నిలకడకు, జట్టుపై ఉన్న విధేయతకు ప్రతీకగా నిలిచిన ఆటగాళ్లు మాత్రమే ఈ ఘనత సాధించారు. 2008 తొలి సీజన్ నుంచి బెంగళూరు జట్టుతోనే ఉన్న విరాట్ కోహ్లీ ఈ జాబితాలో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, ఆ తర్వాత ధోనీ, రోహిత్ శర్మ వంటి భారతీయ క్రికెట్ దిగ్గజాలు ఉన్నారు. ఇప్పుడు వీరి సరసన ఓ విదేశీ ఆటగాడిగా నరైన్ నిలవడం అతడి అంకితభావానికి నిదర్శనం. సునీల్ నరైన్ కేవలం మ్యాచ్‌లు ఆడటమే కాదు, కోల్‌కతా జట్టుకు ఎన్నో అద్భుత విజయాలను అందించాడు. ఐపీఎల్ కెరీర్ మొత్తంలో అతడు ఇప్పటివరకు 203 వికెట్లు పడగొట్టాడు. ఇందులో కేవలం 19 పరుగులిచ్చి 5 వికెట్లు తీయడం అతడి అత్యుత్తమ ప్రదర్శన. బ్యాటర్లను ఉక్కిరిబిక్కిరి చేస్తూ కేవలం 6.78 ఎకానమీతో బౌలింగ్ చేయడం నరైన్‌కే చెల్లింది. లోయర్ ఆర్డర్‌లో వచ్చి మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడే పించ్ హిట్టర్‌గానూ జట్టుకు ఎన్నో సేవలు అందించాడు. ప్రస్తుత సీజన్‌లోనూ నరైన్ తనదైన శైలిలో రాణిస్తున్నాడు. ఆడిన పది మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తీసినప్పటికీ, అతడి ఎకానమీ రేటు 6.64గా ఉండటం గమనార్హం. పరుగులు వరదలా పారుతున్న ఈ లీగ్‌లో ఇంత తక్కువ ఎకానమీతో బౌలింగ్ చేయడం విశేషం. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ జట్లతో జరిగిన మ్యాచ్‌లలో రెండేసి వికెట్లు తీసి ప్రత్యర్థి బ్యాటర్ల జోరుకు అడ్డుకట్ట వేశాడు. వ్యక్తిగతంగా సునీల్ నరైన్ అద్భుత మైలురాయిని అందుకున్నప్పటికీ, కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు పరిస్థితి మాత్రం ప్రస్తుతం అంత ఆశాజనకంగా లేదు. ప్లేఆఫ్స్ రేసులో ఆ జట్టు ఉనికి ఇప్పుడు చెదిరిపోయే స్థితికి చేరింది. బెంగళూరుతో జరిగిన కీలక మ్యాచ్‌లో ఓడిపోవడంతో కేకేఆర్ అవకాశాలు క్లిష్టంగా మారాయి. సమీకరణాల ప్రకారం కోల్‌కతా జట్టు టోర్నీలో నిలవాలంటే ఇకపై ఆడబోయే మిగిలిన మూడు మ్యాచ్‌ల్లోనూ భారీ తేడాతో విజయం సాధించాలి. అంతటితో ఆగకుండా, మిగిలిన జట్ల గెలుపోటములు, నెట్ రన్ రేట్ వంటి ఎన్నో లెక్కలు కోల్‌కతాకు అనుకూలంగా రావాల్సి ఉంటుంది. మిగతా జట్లు మెరుగైన ఫామ్, రన్ రేట్‌తో దూసుకుపోతుండటంతో, ఈ సీజన్‌లో కోల్‌కతా ప్లేఆఫ్స్‌కు చేరడం దాదాపు అసాధ్యమనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. సమిష్టి ప్రదర్శన లేక జట్టు లీగ్ దశలోనే నిష్క్రమించే ప్రమాదంలో ఉన్నప్పటికీ, సునీల్ నరైన్ సాధించిన ఈ మైలురాయి మాత్రం కేకేఆర్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినది. ఒకే జట్టును నమ్ముకుని, సుదీర్ఘ కాలం పాటు ఆ ఫ్రాంచైజీకి వెన్నుముకగా నిలవడం సామాన్యమైన విషయం కాదు. కోల్‌కతా అభిమానుల గుండెల్లో నరైన్ ఎప్పటికీ ఒక అజేయమైన 'మిస్టరీ కింగ్'గానే నిలిచిపోతాడు.

# ఐపీఎల్‌లో ట్రెండింగ్‌లో నోట్ సంబరాలు

మొన్న రఘు శర్మ, నిన్న ఉర్విల్ పటేల్. ఈ ఐపీఎల్ లో నోట్ సంబరాలు చేసుకొని ట్రెండింగ్‌లో నిలిచిన క్రికెటర్లు వీళ్లు. తాజాగా లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ బౌలర్ ఆకాశ్ మహారాజ్ సింగ్ కూడా అదే ట్రెండ్ ఫాలో అవుతూ మైదానంలో అలాంటి సెలబ్రేషన్నే చేసుకొని వైరల్ అయ్యాడు. అయితే ఐపీఎల్‌లో ఇలా చిటీ రాసుకొచ్చి కెమెరాకు చూపిస్తూ సెలబ్రేషన్స్ చేసుకోవడంపై సౌతాఫ్రికా మాజీ క్రికెటర్ డెల్ స్టెయిన్ స్పందించాడు. ఐపీఎల్‌లో ఈ రకమైన సెలబ్రేషన్స్‌కు కాలం చెల్లిందని అభిప్రాయపడ్డాడు. తాజాగా ఎకానా స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ యువ ఆటగాడు ఆకాశ్ మహారాజ్ సింగ్ అదరగొట్టాడు. మూడు వికెట్లు తీసి చెన్నై టాపార్డర్‌ను కుప్పకూల్చాడు. అతడు వరుసగా గైక్వాడ్, శాంసన్, ఉర్విల్ పటేల్‌ను పెవిలియన్‌కు చేర్చాడు. తొలుత 3.4 ఓవర్ వద్ద గైక్వాడ్‌ను క్యాచౌట్ చేయగానే తన జేబులో నుంచి ఓ కాగితం చీటీని బయటకు తీసి కెమెరాకు చూపించాడు. ఇది వైరల్‌గా మారింది. అయితే ఇటీవల కాలంలో ఐపీఎల్‌లో యంగ్ ప్లేయర్లు చేసుకుంటున్న నోట్ సంబరాలపై స్టెయిన్ స్పందించాడు. ఆ కాగితాలను పక్కన పెట్టేయాల్సిన సమయం వచ్చిందని స్టెయిన్ అన్నాడు. ఆ నోట్స్ సంబరాలు ఇప్పుడు ట్రెండింగ్‌లో లేవని, క్రికెట్‌లో ఈ సెలబ్రేషన్ ఏనాడు ఫ్యాషన్ కాదని పేర్కొన్నాడు. ఈ మేరకు ఓ ట్వీట్ షేర్ చేశాడు. 'ఇకపై ఆ కాగితాలను (చిటీలను) పక్కన పెట్టేసే సమయం వచ్చింది. ఇప్పుడు ఎక్కడ కూడా అలాంటి సెలబ్రేషన్ ట్రెండింగ్‌లో లేదు. నిజం చెప్పాలంటే, క్రికెట్‌లో అసలు అది ట్రెండింగ్ కూడా కాదు' అని పోస్ట్‌లో రాసుకొచ్చాడు. దీనిపై నెటిజన్లు కూడా పెద్దగా ఆసక్తి చూపించడం లేదు. 'ఒకరిద్దరు అయితే ఫర్వాలేదు, కానీ ప్రతీ ఒక్కరూ ఇలా సంబరాలు చేసుకుంటే స్పెషల్‌గా ఏమీ అనిపించడం లేదు' అని ఓ యూజర్ కామెంట్ చేశారు. అయితే తాను కెమెరాకు చూపించిన నోట్‌లో ఏముందో ఆకాశ్ మ్యాచ్ అనంతరం వెల్లడించాడు. అది తనకు మోటివేషన్ కోసమే జేబులో ఉంచుకున్నట్లు చెప్పాడు. 'ఆ నోట్‌లో అక్కి ఆన్ ఫైర్! టీ20 క్రికెట్‌లో వికెట్లు తీయడం ఎలాగో ఆకాశ్‌కు బాగా తెలుసు! అని రాసి ఉంది. అది నాకు ప్రేరణ ఇస్తుంది. కేవలం ఓ మోటివేషన్ కోసమే అది జేబులో ఉంచుకుంటా. అంతకంటే పెద్ద స్టోరీ ఏమీ లేదు. ఆడుతున్నపుడు నాకు స్ఫూర్తిని కలిగించడానికే నేను దాన్ని చూపెట్టాను' అని అకాశ్ చెప్పాడు. కాగా, ఈ మ్యాచ్ లో ఆకాశ్ 4 ఓవర్లు వేసి 26 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీసి విజయంలో కీలక పాత్ర పోషించాడు. గతేడాది సన్‌రైజర్స్ బ్యాటర్ అభిషేక్ శర్మ ఈ రకమైన నోట్ సంబరాలను ప్రారంభించాడు. పంజాబ్ కింగ్స్‌తో మ్యాచ్‌లో సెంచరీ బాదిన తర్వాత ఆరెంజ్ ఆర్మీ ఫ్యాన్స్ కోసం ఓ నోట్ రాసుకొచ్చి దాన్ని కెమెరాకు చూపించాడు. అలా మొదలైన ఈ ట్రెండ్‌ను ఈ సీజన్‌లో ముంబయి బౌలర్ రఘు శర్మ, సీఎస్కే బ్యాటర్ ఉర్విల్ పటేల్, తాజాగా ఆకాశ్ కొనసాగించారన్నమాట!



# ఘనంగా క్రాస్ స్టేట్ రియాల్టీ షో జంగిల్ బుగీ కర్టెన్ రైజర్ ఈవెంట్

క్రాస్ స్టేట్ రియాల్టీ షో జంగిల్ బుగి కర్టెన్ రైజర్ ఈవెంట్ శుక్రవారం హైదరాబాద్ లో ఘనంగా జరిగింది. ఈ రియాల్టీ షోలో తెలుగు లయన్స్, హిందీ హాక్స్, తమిళ్ టైగర్స్, మావెరిక్స్, కన్నడ



పాంతర్స్...ఇలా ఐదు టీమ్స్ పాల్గొననున్నాయి. ఈ నెల 17,18వ తేదీల్లో హైదరాబాద్ లో ప్రసాద్ ల్యాబ్స్ వేదికగా జరిగే ఆడిషన్స్ నుంచి వివిధ దశల వడబోత తర్వాత పోటీదారులను ఎంపికచేయను న్నారు. ఈ ఆడిషన్స్ లో దాదాపు 200 మంది పాల్గొంటారని అంచనా. ఆడిషన్స్ నుంచి ఎంపికైన వారు 90 రోజుల పాటు అడవిలో ఉంటూ కార్యక్రమ నిర్వాహకులు సూచించే సాహసాలు చేయాల్సిఉంటుంది. ఎలిమినేషన్స్ తట్టుకుని మిగిలిన కంటెస్టెంట్ విజేత గా నిలుస్తారు. శనివారం జరిగిన జంగిల్ బుగి కర్టెన్ రైజర్ ఈవెంట్ లో సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ – జంగిల్ బుగి అనే రియాల్టీ షోను ఒక పాన్ ఇండియా మూవీ స్థాయిలో డిజైన్ చేయడం గొప్ప విషయం. ఐదు టీమ్స్ ఈ రియాల్టీ షోలో పాల్గొనబోతున్నాయి. ఈ నెల 17, 18 తేదీల్లో ఆడిషన్స్ నిర్వహిస్తున్నారు. ఆడిషన్స్ నుంచి ఎంపికైన వారిని రియాల్టీ షోకు తీసుకుంటారు. 90 రోజులు అడివిలో ఉండి సాహసాలు చేసే ఈ రియాల్టీ షో పార్టిసిపెంట్స్ తో పాటు షో నిర్వాహకు లకు కూడా ఒక ఛాలెంజ్ అనుకోవచ్చు. ఎగ్జైటింగ్ కాన్సెప్ట్ తో వస్తున్న జంగిల్ బుగి రియాల్టీ షో అన్ని భాషల్లో మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా. అన్నారు. సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ వైజే రాంబాబు మాట్లాడుతూ – రియాల్టీ షోస్ కొత్త కొత్త కాన్సెప్ట్స్ తో ఆడియెన్స్ ను ఎంగేజ్ చేస్తుంటాయి. జంగిల్ బుగి కూడా సరికొత్త కాన్సెప్ట్ తో రాబోతోంది. పాన్ ఇండియా స్థాయిలో వస్తున్న ఈ రియాల్టీ షో మంచి ఆదరణ పొందాలి. టీమ్ అందరికీ బెస్ట్ విశెస్ చెబుతున్నాం. అలాగే ఈ జంగిల్ బుగి రియాల్టీ షో కు మీడియా మిత్రుల సపోర్ట్ తప్పకుండా ఉంటుంది. అన్నారు. డైరెక్టర్ యశోధర విక్రమ్ మాట్లాడుతూ – నేను దర్శకుడిగా, రైటర్ గా కన్నడ చిత్ర పరిశ్రమలో పలు చిత్రాలు చేశాను. ఈ కాన్సెప్ట్ నా మిత్రుడు వినోద్ ఇచ్చారు. ఆయన గతంలో కొన్ని రియాల్టీ షోస్ చేశారు. నేను ఒక మూవీ కోసం ఆయన దగ్గరకు వెళ్లినప్పుడు ముందు ఈ రియాల్టీ షో చేద్దాం ఆ తర్వాత సినిమా చేద్దాం అన్నారు. కాన్సెప్ట్ విన్న తర్వాత ఇది చాలా కష్టమైన రియాల్టీ షో, ఛాలెంజింగ్ గా ఉంటుందని అనిపించింది. ప్రముఖ ఛానెల్స్ ను అప్రోచ్ అయ్యాం. పైలట్ ఎపిసోడ్ అడిగారు. త్వరలోనే వారి నుంచి అప్రూవల్ వస్తుంది. జంగిల్ బుగికి దర్శకత్వం వహించడం ఛాలెంజింగ్ గా తీసుకున్నాను. మీ అందరి సపోర్ట్ మాకు ఉంటుందని ఆశిస్తున్నాం. అన్నారు. ఎపిక్ ప్రొడక్షన్స్ అధినేత పార్థసారథి మాట్లాడుతూ – భారత్ అంటే వివిధ సంస్కృతుల సమ్మేళనం. పేరుకే వివిధ రాష్ట్రాల నుంచి పోటీ అని పెట్టాం కానీ మన కల్చర్ ఒకటే అనే చెప్పే ఉద్దేశంతో ఈ షో చేస్తున్నాం. ప్రకృతికి మనం దూరమై పోతూ ఉన్నాం. అడవి అనేది కనుమరుగు అవుతోంది. అడవి, పంటపొలాలు, ప్రకృతి..ఎంత గొప్పగా ఉంటాయో అందరికీ చూపించాలనే లక్ష్యంతో జంగిల్ బుగి రియాల్టీ షో నిర్వహిస్తున్నాం. ఈ షోను మీరంతా సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాం. అన్నారు. జనరల్ క్రియేటివ్ టీమ్ రషీద్ మాట్లాడుతూ – టీవీ కార్యక్రమాలు చాలా వరకు అసహజంగా ఉంటాయి.

మా రియాల్టీ షో రియల్ గా ఉంటుంది. ఎక్కడా ఆర్టిఫిషల్ గా అనిపించదు. ఫారెస్ట్ లో 90 రోజుల పాటు అనేక అడ్వెంచర్స్ తో సాగే సరికొత్త రియాల్టీ షో జంగిల్ బుగి. మా రియాల్టీ షోలో పాల్గొనండి, అలాగే చూసి సపోర్ట్ చేయండి. అన్నారు. సీనియర్ ఫిలిం జర్నలిస్ట్ సురేష్ కొండేటి మాట్లాడుతూ – జంగిల్ బుగి రియాల్టీ షో అన్ని రియాల్టీ షోస్ కంటే ఎగ్జైటింగ్ కంటెంట్, కాన్సెప్ట్ తో వస్తోంది. ఈ షో మంచి విజయం సాధించాలని టీమ్ అందరికీ ఆల్ ది బెస్ట్ చెబుతున్నా. అన్నారు. జంగిల్ బుగి టీమ్ మెంబర్ కమల మాట్లాడుతూ – ఔత్సాహికులకు జంగిల్ బుగి రియాల్టీ షో ద్వారా ఒక గొప్ప వేదిక కల్పిస్తున్నాం.

వ్యూయర్స్ కు మర్చిపోలేని ఎక్స్పీరియన్స్ ను మా షో ఇవ్వబోతోంది. ఈ షో ద్వారా మన ప్రకృతి ఎంత అద్భుతమైనతో తెలియజేసే ప్రయత్నం చేస్తాం. అన్నారు. దర్శక నిర్మాత ఘంటా శ్రీనివాస్ మాట్లాడుతూ – నాకు రియాల్టీ షోస్ అంటే చాలా ఇష్టం. ఈ జంగిల్ బుగి రియాల్టీ షో కూడా అద్భుతంగా ఉంటుందని తెలుస్తోంది. ఈ రియాల్టీ షో పెద్ద సక్సెస్ కావాలని కోరుకుంటున్నా. అన్నారు.



## తేజ సజ్జ, ప్రశాంత్ వర్మ, కె. నిరంజన్ రెడ్డి, ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్ 'హనుమాన్' తెలుగు, హిందీలో 3Dలో జూన్ 25న రిలీజ్

సూపర్ హీరో తేజ సజ్జా, క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో వచ్చిన సంచలన బ్లాక్‌బస్టర్ 'హనుమాన్' మరోసారి భారీ స్థాయిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. పురాణ గాథలు, భావోద్వేగాలు, ఆధునిక కథనాన్ని అద్భుతంగా మిళితం చేసి దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ నేషనల్ అవార్డ్ విన్నింగ్ చిత్రం ఇప్పుడు గ్రాండ్ 3D మేకోవర్‌తో 2026 జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఫస్ట్ రిలీజ్ సమయంలో తన అద్భుతమైన వరల్డ్ బిల్డింగ్, గొప్ప కథనం, అద్భుతమైన సాంకేతిక నైపుణ్యాలతో చరిత్ర సృష్టించింది. ఇప్పుడు 3D ఫార్మాట్‌లో 'అంజనాద్రి' ప్రపంచాన్ని మరింత గ్రాండియర్‌గా, ప్రేక్షకులను పూర్తిగా మైమరపించేలా అనుభూతి కలిగించేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఈ చిత్రంలో అమృత అయ్యర్ కథానాయికగా నటించగా, సినిమాటోగ్రాఫర్ దాశరథి శివేంద్ర అద్భుతమైన విజువల్స్‌తో ప్రత్యేక ప్రపంచాన్ని సృష్టించారు. గౌర హరి, అనుదీప్ దేవ్ అందించిన సంగీతం సినిమాకి ఎమోషన ని తీసుకొచ్చి, ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించింది. ఇప్పటికే కోట్లాది మంది ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న 'హనుమాన్' ఇప్పుడు అప్‌గ్రేడ్ చేసిన 3D విజువల్స్‌తో మరింత అద్భుతమైన అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది. మరోసారి ప్రపంచవ్యాప్తంగా అలరించడా నికి హనుమాన్ సిద్ధంగా ఉంది.

## 'పురుష:'లో అన్ని రకాల ఎలిమెంట్స్ ఉంటాయి..

### కుటుంబ సమేతంగా చూడదగ్గ చిత్రం – దర్శకుడు వీరు వులవల

బత్తుల సరస్వతి సమర్పణలో కళ్యాణ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద బత్తుల కోటేశ్వరరావు 'పురుష:' సినిమాను నిర్మించారు. ఈ చిత్రంతో పవన్ కళ్యాణ్ బత్తుల హీరోగా పరిచయం కాబోతోన్నారు. ఈ మూవీకి వీరు వులవల దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్, సప్తగిరి, కసిరెడ్డి రాజ్ కుమార్, రాయంచ కొక్కుర, విషిక, హాసిని సుధీర్ ముఖ్య పాత్రలను పోషించారు. ఈ సినిమాను మే 22న రిలీజ్ చేయబో తున్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు రిలీజ్ చేసిన పోస్టర్లు, పాటలు, గ్లింప్స్, టీజర్ ఇలా అన్నీ కూడా ఆడియెన్స్‌లో ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశాయి. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా చిత్ర దర్శకుడు వీరు వులవల మీడియాతో పంచుకున్న విశేషాలివే..

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**

నాకు పెయింటింగ్స్ వేయడం అలవాటు. చిన్నప్పుడు హీరోల బొమ్మల్ని క్లాత్ మీద పెయింటింగ్ వేసేవాడ్ని. వాటిని థియేటర్ల ముందు అందరూ కట్టుకునేవారు. ఆ తరువాత బ్యాచ్‌లర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ చేశాను. ఏ పని చేసినా సరే నేను ఇండస్ట్రీలోనే



ఉండాలని అనుకున్నాను. ఆ టైంలోనే 'కొత్త బంగారు లోకం' టైటిల్‌ను రాసి, డిజైన్ చేశాను. అలా నేను ఇప్పటికీ చిరంజీవి గారు, పవన్ కళ్యాణ్ గారు ఇలా చాలా మంది హీరోలకు కలిపి 350కి పైగా టైటిల్స్‌ని రాసి, డిజైన్ చేశాను.

**నిర్మాత గారిని ఎలా ఒప్పించారు? ఆయన కథ విన్న తరువాత ఏం చెప్పారు?**

ఈ కథను పట్టుకుని తిరుగుతున్న టైంలో 'మసూద' సినిమాకి దర్శకత్వ శాఖలో పని చేసే అవకాశం వచ్చింది. అది కూడా మంచి విజయం సాధించింది. ఒక మూడు నెలలు చాలా సీరియస్‌గా వర్క్ చేశాను. ఎంతో మందికి కథను వినిపించాను. అప్పుడు ఓ సారి కోటేశ్వరరావు గారి వద్దకు కథ వెళ్లి ఆగింది. గోవింద్ (పవన్ కళ్యాణ్), కమల (రాయంచ) ప్రేమ కథ మెయిన్ పాయింట్. కాకపోతే సపోర్టింగ్ పాత్రలు ఎక్కువగా ఉంటాయని కోటేశ్వరరావు గారికి చెప్పాను. ఆ కథను విన్న తరువాత ఆయనకు చాలా నచ్చింది. ఇలాంటి సినిమా అయితేనే ఫ్యామిలీ ఆడియెన్స్‌కి మా అబ్బాయి రీచ్ అవుతాడని కోటేశ్వర రావు గారు అనుకుని ఓకే చెప్పారు.

**నిర్మాత గారి సపోర్ట్ గురించి చెప్పండి?**

నిర్మాత కోటేశ్వరరావు గారు ఏ ఒక్క రోజు కూడా ఏ ఒక్క విషయంలో మమ్మల్ని ప్రశ్నించలేదు. ప్రతీ ఒక్క స్టేజ్‌లో మా అందరినీ ప్రోత్సహించారు. ఆయన కూతురు సరస్వతి గారు అయితే ప్రతీ రోజూ సెట్‌లో మా అందరినీ ఎంతో చక్కగా చూసుకున్నారు. వీరిద్దరి సపోర్ట్‌తోనే సినిమాని ఇంత బాగా తీయగలిగాను. సినిమా చూసిన తరువాత కోటేశ్వరరావు గారు నన్ను పట్టుకుని ఏడ్చేశారు. ఇది నా 26 ఏళ్ల కల అని కన్నీరు పెట్టుకున్నారు.

**'పురుష:'లోని పాత్రలు ఎలా ఉంటాయి?**

ప్రేమ కోసం ఏమైనా చేసే ఓ మంచి పాత్రలో పవన్ కళ్యాణ్ కనిపిస్తారు. సప్తగిరి, కసిరెడ్డి పాత్రలు అందరినీ ఎంటర్టైన్ చేస్తాయి. మరీ ముఖ్యంగా కసిరెడ్డి పాత్ర కోసం రాసిన డైలాగ్స్ ఎక్కువగా అలరిస్తాయి.

## చిలకా ప్రొడక్షన్స్ థ్రిల్లర్ 'మరీచిక' ట్రైలర్ విడుదల..

### ప్రేమ, ద్రోహం, ప్రతీకారంతో నిండిన కథ మే 29న వరల్డ్ వైడ్‌గా మూవీ గ్రాండ్ రిలీజ్

నేషనల్ అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ సతీష్ కాసెట్టి తన కొత్త థ్రిల్లర్ మూవీ 'మరీచిక'తో మరోసారి తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. వైవిధ్యమైన , ఆలోచింపజేసే కథలను చూపడంలో ప్రత్యేక గుర్తింపు పొందిన



డైరెక్టర్ మరోసారి తనదైన శైలిలో ఈసారి కూడా ఆసక్తికరమైన సినీ అనుభూతిని అందించినట్టు ట్రైలర్ చూస్తుంటే అనిపిస్తోంది.ఈ చిత్రంలో రెజీనా కసాండ్రా, అనుపమ పరమేశ్వరన్, విరాజ్ అశ్విన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. సినిమా మే 29న భారీ స్థాయిలో థియేటర్లలో భారీ ఎత్తున విడుదలకు సిద్ధమవుతోంది. చిలక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజీవ్ చిలక, మేఘా చిలక ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా శనివారం విడుదలైన ఈ మూవీ ట్రైలర్ ప్రేక్షకుల్లో సినిమాపై మరింత క్యూరియాసిటీని పెంచింది. 'మరీచిక' ట్రైలర్‌ను గమనిస్తే ఎమోషన్స్‌తో పాటు మిస్టరీ అంశాలతో ప్రారంభమైంది. ఇందులో వెంకట లక్ష్మి అనే పల్లెటూరి అమ్మాయి పాత్రలో అనుపమ పరమేశ్వరన్ కనిపించారు. సంజు పాత్రలో విరాజ్ అశ్విన్ కనిపించగా.. మరీచిక పాత్రలో రెజీనా కసాండ్రా కనిపించారు. సంజుని మరీచిక చంపేసిందంటూ అనుపమ పరమేశ్వరన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటం.. ఆ తర్వాత కొన్ని ఇంట్రెస్టింగ్ సీన్స్.. తర్వాత సంజు పాత్రను పరిచయం చేయటం.. తర్వాత మరీచిక పాత్రను పరిచయం చేయటం.. ఏ పాత్రకు ఆ పాత్ర మరో పాత్రతో సంబంధం ఉన్నట్లు, లేనట్లు చూపించి సినిమాపై ఆసక్తిని క్రియేట్ చేశారు. ఎన్నారై అమ్మాయి మరీచిక పాత్రలో రెజీనా కనిపిం చింది. ఈ మూడు పాత్రల మధ్య జరిగిన ఎమోషనల్, థ్రిల్లింగ్ ట్విస్టులు, టర్నులతో సినిమా ఉండనుందని ట్రైలర్‌తో తెలుస్తోంది. కథ ముందుకు సాగేకొద్దీ పాత్రల మధ్య ఉన్న సంబంధాలు మారిపోతూ కనిపించాయి. అలాగే భావోద్వేగాలను చూపిస్తూనే సన్నివే శాలు అనుమానాల వైపు దారితీస్తూ కనిపిం చాయి. అనుపమ పరమేశ్వరన్ పోషించిన పాత్ర, విరాజ్ అశ్విన్చ రెజీనా కసాండ్రా మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యాన్ని చూసిన తర్వాత పూర్తిగా మారిపోతుంది. మొదట మృదువైన ప్రేమకథలా ప్రారంభమైన ఈ కథ, క్రమంగా ఉత్కంఠ, భావోద్వేగ వేదన, అనూహ్య మలుపులతో నిండిన థ్రిల్లర్‌గా మారుతుంది. ట్రైలర్‌లో కీలకమైన కథాంశాలను బయటపె ట్టకుండా, ప్రతి పాత్ర చుట్టూ ఒక మిస్టరీ ఉన్నట్టు కనిపించటం ప్రత్యేక ఆకర్షణగా అనిపిస్తోంది. ట్రైలర్ రెండో భాగంలో మరింత ఉత్కంఠభరితమైన దృశ్యాలు, హత్య దర్యాప్తు ఆసక్తిని పెంచుతున్నాయి. అసలు సంజూను ఎవరు హత్య చేశారు? మరీచిక ఎవరు? వారి జీవితాల్లో జరుగుతున్న పరిణామాలకు ద్రోహమే కారణమా? అనే ప్రశ్నలు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. పోలీస్ దర్యాప్తు, భావోద్వేగ ఘర్షణలు, మిస్టరీ సన్నివేశాలు ఈ కథలో సైకలాజికల్, రివేంజ్ డ్రామా ఉండబో తుందనే సంకేతాలు ఇస్తున్నాయి. ప్రేక్షకులను ఉత్కంఠలో ఉంచే థ్రిల్లర్‌ను మన ముందుకు రానున్నట్లు స్పష్టమవుతోంది. లెజెండ్రీ మ్యూజిక్ డైరెక్టర్ ఇళయరాజా అందించిన సంగీతం.. నేపథ్య సంగీతం ట్రైలర్ మొత్తం ఉత్కంఠను, భావోద్వేగ తీవ్రతను మరింత పెంచాయి. ఆకట్టుకునే కథ, కథనం, ఎమోషనల్ యాక్టింగ్, సస్పెన్స్‌తో కూడిన నెరేషన్‌ను చూస్తుంటే మరీచిక తెలుగు ప్రేక్షకులకు థియేటర్లలో ఒక కొత్త, ఉత్కంఠభరితమైన సినీ అనుభూతిని అందించబోతుందనిపిస్తోంది.

## క్రమశిక్షణ కలిగిన నటుడు విజయ్: మాళవిక

కోలీవుడ్ అగ్ర కథానాయకుడు, తమిళనాడు సీఎం విజయ్‌పై నటి మాళవిక మోహనన్ ప్రశంసలు కురిపించారు. విజయ్‌తో కలిసి మాస్టర్ సినిమాలో నటించిన ఆమె ఆయనతో తనకున్న స్నేహం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆ షూటింగ్‌లోనే విజయ్‌ను తొలిసారి కలిసినట్లు చెప్పారు. మాస్టర్' సినిమా మొదటిరోజు షూటింగ్‌లోనే చాలా కష్టమైన సీన్ చేయాల్సి వచ్చింది. నా డైలాగ్స్ మీదే దృష్టిపెట్టాను. ఆయన మాత్రం ఎలాంటి కష్టమైన సీన్‌లో నటించాల్సి వచ్చినా చాలా ప్రశాంతంగా ఉంటారు. ప్రతి విషయాన్ని గమనిస్తూ పూర్తిగా పని పైనే ఫోకస్ చేస్తారు. చాలా సరదాగా ఉంటారు. ఎప్పుడు అవసరం వచ్చినా ఫోన్ చేయగలిగే స్వేచ్ఛ ఇచ్చారు. అంత పెద్ద స్టార్ అయినప్పటికీ అలా అందుబాటులో ఉండడం చాలా గొప్ప విషయం అని చెప్పారు. విజయ్ క్రమశిక్షణ తనపై ప్రభావం చూపిందని ఆమె అన్నారు. 'మోహన్‌లాల్, రజనీకాంత్, విజయ్ లాంటి సీనియర్ నటుల సినిమాల్లో పనిచేయడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకోవచ్చు. ఉదయం 7 గంటలకు కాల్‌షీట్ ఉంటే 6:55కే సెట్స్‌లో ఉంటారు. అలాంటి వారి వల్ల నిర్మాతలకు డబ్బు వృథా కాదు అని తెలిపారు.

## 'తిమ్మరాజుపల్లి టీవీ' చిత్రీకరణలో అదొక మెమరబుల్ మూమెంట్: నటుడు ప్రదీప్ కొట్టె

న్యూ టాలెంట్ ను ఎంకరేజ్ చేస్తూ హీరో కిరణ్ అబ్బవరం సుమైర స్టూడియోస్‌తో కలిసి తన కేఏ ప్రొడక్షన్స్‌పై నిర్మించిన సినిమా 'తిమ్మరాజుపల్లి టీవీ'. ఈ మూవీకి తేజ వేల్పుచర్ల సహ నిర్మాతగా వ్యవహరిం చారు. ఈ సినిమాతో వి.మునిరాజు దర్శకుడిగా పరిచ యమయ్యారు. విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో సాగే పీరియాడిక్ డ్రామా మంచి విజయాన్ని అందుకుంది. 'తిమ్మరాజు పల్లి టీవీ' సినిమా ఈ నెల 15వ తేదీ నుంచి ఆహా ఓటీటీలో స్ట్రీమింగ్ కు రాబోతోంది. ఈ సందర్భంగా నటుడు ప్రదీప్ కొట్టె తన సినీ జర్నీ గురించి విశేషాలను పంచుకున్నారు. ఆయన చెప్పిందేంటంటే...

**★ నేపథ్యం..**

– మాది చిత్తూరు జిల్లా పళమనేరు. చెన్నైలో జాబ్ చేశాను. హైదరాబాద్‌కి షిఫ్ట్ అయ్యాను. ఇక్కడకు వచ్చాక షార్ట్ ఫిల్మ్స్ అంటూ యాక్టింగ్ వైపు వచ్చాను. బీ స్టూడియోలో బషీర్ మాస్టర్ నేతృత్వంలో నాటకాలు వేశాను. ఆ నాటకాల్ని మా డైరెక్టర్ వి.మునిరాజుగారు చూశారు. నాకు రాజప్ప కారెక్టర్ అని చెప్పి ఆడిషన్ చేశారు. ఆ తరువాత కిరణ్ అబ్బవరం గారు నిర్మాత అని తెలియగానే చాలా కాన్ఫిడెంట్ వచ్చింది.

**★ తొలి అవకాశం...**

– 'తిమ్మరాజు పల్లి టీవీ' రాజప్ప పాత్రకు మంచి ప్రశంసలు దక్కాయి. అందులో చాలా వేరియేషన్స్ ఉంటాయి. ఈ పాత్రతో నాకు మంచి రెస్పాన్స్ దక్కింది. నాకు తొలి సినిమా, అవకాశం అంటే ఇదే అని చెప్పుకోవచ్చు. షార్ట్ ఫిల్మ్స్, ఇండిపెండెంట్ సినిమాలు చేశాను కానీ.. తొలి ఫీచర్ ఫిల్మ్, మొదటి సారిగా స్క్రీన్ మీద కనిపించింది ఈ చిత్రంలోనే.

**★ రెండింటిని బ్యాలెన్స్ చేస్తూ..**

– నేను నా జాబ్ చేస్తూనే సినిమా అవకాశాల కోసం ప్రయత్నించాను. వర్క్ ఫ్రమ్ హోం, లీవ్స్ అంటూ ఈ మూవీని కూడా మ్యానేజ్ చేశాను. నేను పూర్తి స్థాయిలో ప్రయత్నించలేకపోవడంతోనే ఇంత ఆలస్యం అయి ఉంటుందని భావిస్తున్నాను. గత పదేళ్ల నుంచి రెండింటిని బ్యాలెన్స్ చేస్తూనే ఉన్నాను. అలాగే నా కుటుంబం నుంచి మంచి సపోర్ట్ దొరికింది. ముఖ్యంగా నా శ్రీమతి ఇచ్చిన మద్దతు మరచిపోలేను. ఫ్యామిలీకి సంబంధించిన విషయాలను ఆమె చూసుకోవటం వల్ల నేను కెరీర్‌లో ఓ వైపు జాబ్ చేస్తూ మరో వైపు సినిమాలపై ఫోకస్ పెట్టాను.



**★ కిరణ్ అబ్బవరం అప్పటి నుంచే..**

– నాకు చిన్నప్పటి నుంచీ సినిమాలంటే ఇష్టం. కానీ నాకు ఇదొక ప్యాషన్ అని తెలీదు. ఇంజనీరింగ్ టైంలో ఓ షార్ట్ ఫిల్మ్ చేశాను. నాకు నటన మీద ఇంట్రెస్ట్ ఉందని అప్పుడు అర్థమైంది. అయితే మేం షార్ట్ ఫిల్మ్స్ చేసే టైంలోనే కిరణ్ అబ్బవరం గారు నాకు తెలుసు. నేను ఒక ఆర్టిస్ట్ అని ఆయనకు కూడా తెలుసు. ఆయనకు ఆ టైంలోనే ఫ్యాన్ ఫాలోయింగ్ ఉండేది. ఆయన ప్రతీ ఒక్క క్రాఫ్ట్ మీద పట్టు సాధించి ఈ స్థాయికి వచ్చారు.

**★ ఆ భయం లేదు..**

– నాకు ఈ పదేళ్ల అనుభవంలో కెమెరా భయం అనేది పోయింది. కెమెరా ముందు ఎలా నటించాలి అన్న విషయం తెలిసింది. డైలాగ్ డెలివరీ, డిక్షన్ అనేది థియేటర్ డ్రామాలో తెలిసింది. ఒకే నాటకంలో గంటన్నర పాటుగా ఐదు పాత్రలను పోషించాను.డైరెక్టర్ మునిరాజుగారు ప్రతీ ఒక్క విషయాన్ని, సీన్‌ను డీటైలింగ్‌గా వివరించేవారు. వర్క్ షాప్ మాకెంతో ఉపయోగపడింది.

**★ప్రతీ పాత్ర ఇంపాక్ట్ క్రియేట్ చేసేదే..**

– ఈ మూవీలో సాయి తేజ్, లతీష్ ఇలా చాలా మంది నటించిన పాత్రలు నాకు ఇష్టం. చాలా వరకు అందరూ సింగిల్ టేక్స్‌లోనే నటించారు. ప్రతీ ఒక్క పాత్ర ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది.

**★ అదొక మెమొరబుల్ మూమెంట్...**

– నేను యాక్టింగ్ సైడ్ ఉన్నానని మా ఇంట్లో ఎవ్వరికీ తెలీదు. కాస్తో కూస్తో మా అక్కకి తెలుసంతే. మా అమ్మనాన్నలకు చెప్పకుండా షూటింగ్‌కి తీసుకు వచ్చింది మా అక్క. అలా మా పేరెంట్స్‌ని అలా చూడటం, వారు నన్ను అలా చూడటం అదొక మెమరబుల్ మూమెంట్.

**★ నెక్ట్స్ మూవీస్..**

– ప్రస్తుతం కొన్ని కథలు వింటున్నాను. కాస్త ఇంపార్టెంట్ ఉన్న పాత్రలే పోషించాలని వెయిట్ చేస్తున్నాను. అవకాశాలు వస్తున్నాయి కదా? అని ఏదో ఒకటి చేయాలని అనుకోవడం లేదు.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/A2380